సుద్దముక్కకూ అరువు... బడి నిర్వహణ బరువు





విద్యార్థుల సంఖ్య	నిర్వహణ నిధి
1-20	రూ.10 వేలు
21-50	రూ.15 వేలు
50-100	రూ.20 వేలు
101-250	రూ.50 వేలు
251-1000	రూ.75 వేలు
1000 ఆపైన	రూ. లక్ష

● స్కూల్ కాంప్లెక్స్‌లు 273 ఉంటే ఒక్కోదానికి రూ.25 వేలు, ఎంఆర్‌సీ కార్యాలయానికి రూ.75 వేలు మంజూరు చేయాలి. ఇవ్వన్నీ సకాలంలో విడుదల కావడం లేదు.

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : ఇల్లు గడవాలంటే రోజువారీ, నెలవారీ ఖర్చులు వేసుకోవాలి. నిర్వహణకు సంబంధించి నిధులు సమకూర్చుకొని కేటాయింపుల వారీగా వాటిని ఖర్చు చేసుకోవాలి. అప్పుడే కుటుంబం అనే బతుకుబండి సజావుగా సాగుతుంది. అరకొర నిధులతో నిర్వహణ సాగించాలంటే ఒడిదొడుకులు, అవస్థలు తప్పవు. అలాంటి సమయంలో దైనందిన కార్యక్రమాలలో ఎలాంటి పరిస్థితులు నెలకొంటాయో ప్రతి ఒక్కరూ ఆలోచించుకోవచ్చు. అదే లక్షలాది మంది విద్యార్థులున్న ప్రభుత్వ పాఠశాలల వ్యవస్థలో ఇలాంటి నిర్వహణ సాగించాలంటే ప్రణాళికతో కార్యాచరణ అమలు చేయాలి. నిర్వహణ లోపాలు తలెత్తితే అవి బోధన మీద ప్రభావం చూసే అవకాశాలు ఉన్నాయి. గత జగన్ సర్కార్ హయాంలో అదే జరిగింది. పాఠశాల నిర్వహణ నిధులకు ఎసరు పెట్టి రూపాయి కూడా విదల్చక పోవడంతో ఆ భారం అంతా ప్రధానోపాధ్యాయులపై పడింది.

పాఠశాలలను పట్టించుకోని జగన్ సర్కార్

కూటమిపైనే ప్రధానోపాధ్యాయుల ఆశలు

రూపాయి విదల్చని నాటి ప్రభుత్వం

జిల్లాలో పరిస్థితి ఇది

జిల్లాలో 2,227 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ఆయా పాఠశాలల్లో సుద్దముక్క మొదలుకుని, స్టేషనరీ, విద్యుత్తు ఛార్జీలు, ఇతర ఖర్చులకు నిర్వహణ నిధులను ప్రభుత్వం మంజూరు చేయాలి. మదనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1,500 మందిపైగా విద్యార్థులు ఉన్నారు. వీరికి ఏడాదికి పాఠశాల నిర్వహణ కోసం రూ.లక్ష నిధులు రావాల్సి ఉంది. 2019 సంవత్సరంలో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూడేళ్లు మాత్రమే పాఠశాల నిర్వహణ, స్కూల్ కాంప్లెక్స్ నిధులిచ్చారు. తర్వాత విడుదల చేయలేదు. దీంతో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సొంత నిధులు కొంత వినియోగించుకుని పాఠశాల నిర్వహణ సాగించారు. నాడు-నేడు తప్ప మరే నిధులు విడుదల చేయలేదని పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంటున్నారు.

● గత వైకాపా సర్కారు హయాంలో 2022-23 విద్యా సంవత్సరానికి గానూ 60 శాతం నిధులివ్వగా, 2023-24 విద్యా సంవత్సరానికి ఒక్క రూపాయి కూడా పాఠశాలల నిర్వహణకు విడుదల కాలేదు. దీంతో ఆయా పాఠశాలల నిర్వహణ ఎలా సాగుతుందన్నది అగమ్యగోచరంగా తయారైంది. ప్రస్తుతం జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ దుస్థితి అలాగే ఉంది.

నిధులు వినియోగమిలా...

చాక్‌పీస్‌లు, స్టేషనరీ, విద్యార్థుల మార్కుల నమోదు, రిజిష్టర్‌లు, వివిధ కార్యక్రమాల అమలు వంటి రోజువారీ ఖర్చుల కన్నా విద్యుత్తు ఛార్జీలు అధికంగా చెల్లించాల్సి రావడం గుదిబండగా మారింది. నాడు-నేడు పనులు జరుగుతున్న పాఠశాలల్లో విద్యుత్తు బిల్లులు అధికంగా వస్తున్నాయనీ నెలలు తరబడి చెల్లించకుండా కాలం వెళ్లదీస్తున్నారని తెలుస్తోంది. పలుమార్లు ఈ విషయాన్ని సైతం ప్రధానోపాధ్యాయులు వైకాపా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. వారి ఘోషను నాటి పాలకులు పట్టించుకున్న పాపానపోలేదు. పలువురు ప్రధానోపాధ్యాయులు తమ సొంత నిధులు వెచ్చించి నిర్వహణ కొనసాగిస్తున్నారు. నెలలు గడుస్తున్న కొద్దీ నిధులు విడుదల కాకపోవడంతో ఎన్ని రోజులు ఇలా గడపాలని ఆవేదన వ్యక్తమవుతోంది. ఈ ప్రభుత్వమైనా ఈ నిధుల విడుదల, నిర్వహణ చేయించడంలో ప్రత్యేక దృష్టి సారించాలని ప్రధానోపాధ్యాయులు కోరుతున్నారు.

● వైఎస్‌ఆర్ జిల్లాకు సంబంధించి మొత్తంగా 2013 పాఠశాలలకు ఏడాదికి రూ.4.7 కోట్లు నిర్వహణ నిధులు అవసరమవుతాయని అధికారులు లెక్కగట్టారు. 2022-23 విద్యా సంవత్సరం ఉమ్మడి కడప జిల్లాలోని 3,238 పాఠశాలలకు రూ.8.47 కోట్లు నిర్వహణ నిధులు అవసరమవుతాయని అధికారులు అంచనా వేశారు.

త్వరలోనే నిధుల విడుదల

పాఠశాల నిర్వహణకు నిధులు రావడం లేదన్న అంశాన్ని జిల్లా విద్యాశాఖాధికారి, ఇన్‌ఛార్జి జిల్లా సమగ్రశిక్ష అదనపు పథక సమన్వయకర్త మార్రెడ్డి అనురాధ దృష్టికి తీసుకెళ్లగా త్వరలోనే పాఠశాలల నిర్వహణ నిధులు విడుదల కానున్నాయని చెప్పారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయగానే అన్ని పాఠశాలలకూ వాటిని అందిస్తామని తెలిపారు.

కేంద్ర కారాగారం పరిశీలన

కడప న్యాయవిభాగం, న్యూస్‌టుడే: కడపలోని కేంద్ర కారాగారాన్ని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ జడ్జి బాబా ఫకృద్దీన్ సోమవారం పరిశీలించారు. పురుషులు, మహిళా ఖైదీల విభాగాలను అక్కడ ఉన్న లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను పరిశీలించారు. ఉచిత న్యాయ సహాయం పొందే విధానాన్ని వివరించారు. సమస్యలు ఏమైనా ఉంటే అర్జీల రూపంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ న్యాయవాదులకు అందించాలని సూచించారు. సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

జీర్ణోద్ధరణ పనులు వేగవంతం చేయండి

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఒంటిమిట్ట రామాలయంలో జీర్ణోద్ధరణ పనులను శరవేగంగా చేపట్టాలని కేంద్ర పురావస్తుశాఖ అమరావతి ఉప పర్యవేక్షణాధికారి దేబేంద్రనాథ్ బోయి పేర్కొన్నారు. రామయ్య క్షేత్రాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ముఖ మండపం, అంతరాలయం, గర్భగుడి, ప్రాకారం గోడ, రంగ మండపం తాపల నిర్మాణం పనులను పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. గర్భాలయం, విమానం గోపురంపైన పనులు మరో నెల రోజుల్లో పూర్తి చేయాలని గుత్తేదారును ఆదేశించారు. సహాయ సాంకేతిక నిపుణులు భానుప్రకాష్ వర్మ, జిల్లా పురావస్తుశాఖ అధికారి బాలకృష్ణారెడ్డి, ఏఈ అమరనాథ్‌రెడ్డి, ఆలయ తనిఖీ అధికారి నవీన్‌కుమార్, గుత్తేదారు కృష్ణమూర్తి పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న పురావస్తుశాఖ ఉప పర్యవేక్షణాధికారి దేబేంద్రనాథ్ బోయి

దుష్ట శిక్షణి... శిష్ట రక్షణి



రాయచోటి వీరభద్రాలయంలో పార్వతీదేవి అలంకారంలో భద్రకాళీదేవి అమ్మవారు





రాజంపేటలో కన్యకా పరమేశ్వరి అమ్మవారి దర్శనానికి బారులుతీరిన భక్తులు

దేవీ శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా సోమవారం జగజ్జనని మహాచండిగా దర్శనమిచ్చారు... జిల్లావ్యాప్తంగా జగన్మాత తేజోమయమైన రూపంతో భక్తులకు దర్శనమిచ్చారు. సింహంపై కొలువైన అమ్మవారు ఎనిమిది చేతులతో వివిధ రకాల ఆయుధాలు ధరించి, రాక్షస సంహారం చేసి, లోకకల్యాణం జరిపించిన దివ్యరూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. బంగారు రంగు చీరలో మెరిసిపోతున్న దుర్గమ్మకు చండీయాగాలు నిర్వహించడంతో పాటు తెల్లనువ్వులు కలిపిన బెల్లం పొంగలి, వడలు నివేదించారు. ప్రధాన ఆలయాల్లో అమ్మవారి దేదీప్య రూపాన్ని దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు. ఆయా ప్రత్యేక అలంకారాల చిత్రాలివి. **- న్యూస్‌టుడే, అన్నమయ్య బృందం**


మదనపల్లె నీరుగట్టువారిపల్లెలో అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చిన చౌడేశ్వరి


వాల్మీకిపురం మండలం గండబోయనపల్లెలో మహాచండీశ్వరీ దేవి అలంకరణలో సత్యమ్మ తల్లి


పీలేరులో లలితాదేవి అలంకారంలో కన్యకాపరమేశ్వరి

అట్టపెట్టెతో ప్రమాదాలకు అడ్డుకట్టా?



నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే కడప-తిరుపతి జాతీయ రహదారి అధ్వానంగా తయారైంది. 2002లో రేణిగుంట-రాయలచెరువు రహదారిని నిర్మించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదు. దీంతో అక్కడక్కడ భారీ గుంతలు ఏర్పడ్డాయి. గత నాలుగు నెలల్లో ఆరు ప్రమాదాలు చోటుచేసుకోగా ముగ్గురు మృత్యువాత పడ్డారు. 20 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. రాజంపేట మండలం బోయనపల్లి వద్ద భారీ గుంత ఏర్పడటంతో స్థానికులు ప్రమాదాలు జరగకుండా అట్టపెట్టెను అడ్డంగా పెట్టారు. ఇది ఎంత వరకు ప్రమాదాలను నివారిస్తుందన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఈ విషయమై జాతీయ రహదారి ఏఈ నారాయణస్వామిని వివరణ కోరగా.. రహదారి మరమ్మతులు చేపడతామన్నారు. **- న్యూస్‌టుడే, రాజంపేట గ్రామీణ**

వైవీయూ బీటెక్ ఫలితాల విడుదల

వైవీయూ (కడప), న్యూస్‌టుడే: యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు వైఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాల బీటెక్ 2, 4 సెమిస్టర్ పరీక్ష ఫలితాలను వీసీ కె.కృష్ణారెడ్డి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ జయరామిరెడ్డి కలిసి సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా బీటెక్ రెండో సెమిస్టర్ సివిల్ ఇంజినీరింగ్‌లో 11.11 శాతం, కంప్యూటర్ సైన్స్ విభాగంలో 94.29, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రికల్ విభాగంలో 20 శాతం, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ విభాగంలో 46.43, మెకానికల్ ఇంజినీరింగ్‌లో సున్నా శాతం ఫలితాలు వచ్చాయన్నారు. నాలుగో సెమిస్టర్‌లో సివిల్ ఇంజినీరింగ్‌లో 74.19 శాతం, కంప్యూటర్ సైన్స్ విభాగంలో 87.50, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రికల్ విభాగంలో 73.08 శాతం, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ విభాగంలో 100, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో 84.85, మెటలర్జీ అండ్ మెటీరియల్ టెక్నాలజీ 77.78 శాతం ఫలితాలు వచ్చాయని వెల్లడించారు.

బిడుగుల జీవితాలపై పిడుగు

ఇద్దరు మహిళల మృతి * మరో ఏడుగురికి తీవ్ర గాయాలు

- న్యూస్‌టుడే, సంబేపల్లె (రాయచోటి)

రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితి వారిది.... కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సాఫీగా సాగిపోతున్న కూలీ కుటుంబంపై ప్రకృతి కన్నెర్ర చేసింది. పనిలో నిమగ్నమైన వారిపై పిడుగు పడటంతో ఇద్దరు మహిళలు అక్కడికక్కడే మృత్యువాత పడగా మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన సంబేపల్లె మండలం ఎస్.సోమవరం పంచాయతీ బాలప్పగారిపల్లిలో తీవ్ర విషాదం నింపింది.


ఘటనా స్థలంలో పోలీసులు
మృతులు మల్లేశ్వరమ్మ, శంకరమ్మ

● సంబేపల్లె మండలం శెట్టిపల్లె దిగువ దళితవాడకు చెందిన కూలీలు సోమవారం రోజు మాదిరిగానే తోటల్లో కూలి పనులకు వెళ్లారు. సోమవారం ఉదయం బాలప్పగారిపల్లె వద్ద టమాట తోటలో కాయలు కోసేందుకు 12 మంది కూలీలు ఆటోలో వెళ్లారు. పనిలో భాగంగా కాయల కోత పూర్తి చేసుకుని గ్రేడింగ్ చేస్తుండగా ఒక్కసారిగా పెద్ద శబ్దంతో పిడుగు పడింది. పోతుల శంకరమ్మ (35), మల్లేశ్వరమ్మ (38)లు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఏడుగురు కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. శంకరమ్మకు భర్త చిన్న వెంకటరమణ, కుమారుడు ఉన్నారు. మల్లేశ్వరమ్మకు భర్త జ్ఞానప్ప, ఇద్దరు కుమారులున్నారు. ఘటనా స్థలంలో ఉన్న కూలీలు జయమ్మ (50), యశోదమ్మ (60), కార్తిక్ (15), రమణమ్మ (50), అలివేలమ్మ (25), సరస్వతి (35), రెడ్డెమ్మ (25)లు గాయపడ్డారు. సంఘటనా స్థలానికి చేరుకున్న రాయచోటి గ్రామీణ సీఐ వరప్రసాద్, ఎస్.ఐ. భక్తవత్సలం క్షతగాత్రులను రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కార్తిక్ పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రథమ చికిత్స అనంతరం కడప రిమ్స్‌కు తరలించారు.

మంత్రి దిగ్భ్రాంతి : పిడుగు పాటుకు ఇద్దరు మహిళలు మృతి చెందిన ఘటనపై రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విజయవాడ నుంచి మృతుల కుటుంబీకులతో చరవాణిలో మాట్లాడారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు.

మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం

ఈనాడు, అమరావతి : పిడుగుపాటుతో చనిపోయిన శంకరమ్మ, మల్లీశ్వరమ్మ కుటుంబాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.5 లక్షల పరిహారం ప్రకటించారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా వైద్యాధికారుల్ని ఆదేశించారు.

జిల్లాలో మరో మూడు ఇసుక రీచ్‌లు : కలెక్టర్



రాయచోటి, న్యూస్‌టుడే: జిల్లాలో మరో మూడు ఇసుక రీచ్‌లు అందుబాటులోకి తీసుకొస్తున్నామని కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన మాట్లాడారు. ఉచిత ఇసుక కోసం ఏపీ శ్యాండ్ మేనేజ్‌మెంట్ వెబ్ పోర్టల్ లేదా సచివాలయాలలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జిల్లాలో ఉచిత ఇసుక పాలసీ పటిష్ఠంగా అమలవుతోందన్నారు. మరో మూడు ఇసుక రీచ్‌లను ఈ నెల 16వ తేదీకి అందుబాటులోకి తేవడం జరుగుతుందన్నారు. రాజంపేట మండలం బుడుగుంటపల్లి నుంచి రోజూ ఆరు వేల మెట్రిక్ టన్నుల ఇసుక రవాణా అవుతుందన్నారు. ఇప్పటి వరకు అయిదు లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. మరో మూడు రీచ్‌లు అందుబాటులోకి వస్తే 75 వేల మెట్రిక్ టన్నుల ఇసుక ప్రజలకు అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు. దరఖాస్తుదారులు నిర్వహణకు టన్నుకు రూ.307 మాత్రమే చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇసుక కోసం దరఖాస్తు చేసుకునే వారు ఎక్కడ నుంచి ఎక్కడికి రవాణా చేయాలనే విషయాన్ని స్పష్టంగా తెలియజేయాల్సి ఉంటుందన్నారు. ప్రజలు ఉచిత ఇసుక పాలసీ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మైనింగ్ అధికారి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పీఆర్సీ వెంటనే అమలు చేయాలి

కడప విద్య, న్యూస్‌టుడే : ప్రభుత్వం తక్షణం 12వ పీఆర్సీని అమలు చేయాలని, ఆ లోపు 30 శాతం మధ్యంతరభృతి ఇవ్వాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా డిమాండ్ చేశారు. స్థానిక యూటీఎఫ్ భవన్‌లో సోమవారం జిల్లా అధ్యక్షుడు మాదన విజయకుమార్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. లక్ష్మీరాజా మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వ విధానాలతో పదకొండో పీఆర్సీలో ఉద్యోగ, ఉపాధ్యాయులు పూర్తిగా నష్టపోయారన్నారు. గత ప్రభుత్వం నియమించిన డాక్టర్ మన్మోహన్‌సింగ్ కమిషన్ బాధ్యతల నుంచి వైదొలగినందున కొత్త పీఆర్సీ అమల్లో జాప్యమయ్యే అవకాశముందని, ఈ నేపథ్యంలో కొత్త ప్రభుత్వం దసరా కానుకగా 30 శాతం మధ్యంతరభృతిని ప్రకటించాలని డిమాండ్‌చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెంమహేష్‌బాబు, కోశాధికారి నరసింహారావు, కార్యదర్శి రమణ, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రైతేరాజు 6లో

కడప - హైదరాబాదు

రోజువారీ విమాన సర్వీసులకు బుకింగ్ ప్రారంభం



ఎన్‌జీవో కాలనీ (కడప), న్యూస్‌టుడే: ఈ నెల 27 నుంచి విమానయాన సంస్థ ఇండిగో కడప విమానాశ్రయం నుంచి హైదరాబాదుకు రెగ్యులర్ విమాన సర్వీసులు నడపనుంది. హైదరాబాదులో ఉదయం 11.30 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 12.40 గంటలకు కడపకు వస్తుంది. కడపలో సాయంత్రం 3.55 గంటలకు బయలుదేరి సాయంత్రం 5.10 గంటలకు తిరిగి హైదరాబాదు చేరనుంది. టిక్కెట్లు బుక్ చేసుకునేందుకు, ఇతర వివరాలకు www.goindigo.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సంస్థ ప్రతినిధులు తెలిపారు.

శెట్టిగుంట బొమ్మలు... ఆధునిక హంగులు


కొయ్యతో రాజురాణి బొమ్మలు తయారు చేస్తున్న కళాకారులు


కొయ్యబొమ్మలు

శెట్టిగుంట చెక్క బొమ్మలంటే రాష్ట్రవ్యాప్తంగా ప్రసిద్ధి. గతంలో చెక్క బొమ్మల్లానే ఉండేవి. ప్రస్తుతం వాటికి అదనపు హంగులు సమకూరుతున్నాయి. రంగులు, దుస్తులు, పూసలు, నగలు, చెమ్కీ మెరుపులతో సరికొత్త నగిషీలు చెక్కుతున్నారు. రైల్వేకోడూరు పరిధిలోని శెట్టిగుంట పంచాయతీ లక్ష్మీగారిపల్లెలో మహిళలు ఇలాంటి బొమ్మలు రూపొందిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. ఇటీవల కలెక్టరు శ్రీధర్‌ను కలిసిన కళాకారులు తాము రూపొందించిన రాజురాణి బొమ్మలను బహూకరించగా వాటిని చూసి ఆయన ముచ్చటపడ్డారు. **- న్యూస్‌టుడే, రైల్వేకోడూరు**

రాజు రాణి బొమ్మల తయారీలో మార్పులు

హస్తకళల అభివృద్ధి సంస్థ సహకారంతో ముందడుగు

ప్రత్యేక రూపుతో తయారీకి మహిళలకు శిక్షణ

ప్రత్యేక శిక్షణతో మార్పు : గత వైకాపా ప్రభుత్వంలో హస్తకళలు మరుగునపడ్డాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక కళలను మెరుగుపరిచే విధంగా చర్యలు తీసుకుంటోంది. హస్తకళల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రైల్వేకోడూరుకు చెందిన కాన్వాస్ ఆర్టిస్ట్ పూల శ్రీదేవి సమక్షంలో రెండు నెలలుగా మహిళలకు శిక్షణ ఇచ్చారు. లక్ష్మీగారిపల్లెలో 20 మంది మహిళలకు రాజురాణి, ఇతర దేవతామూర్తుల వంటి బొమ్మలకు హంగులు ఎలా అద్దాలో నేర్పించారు. లేపాక్షి ద్వారా ఈ బొమ్మలను కొనుగోలు చేసేలా చర్యలు చేపడుతున్నారు.



కళలో మెలకువలు నేర్చుకున్నాం ; గతంలో మేము తయారు చేసిన చెక్క బొమ్మలను ఏ హంగులూ లేకుండా విక్రయించేవాళ్లం. దీంతో కొంత మేర ఆదాయం లభించేది. నేర్పు, ఓర్పుతో బొమ్మలను అందంగా తీర్చిదిద్దడం నేర్పించారు. ప్రభుత్వం చేయూతనిస్తే మాలాంటి మహిళల జీవనోపాధికి భరోసా ఏర్పడుతుంది. అదనపు హంగులు అద్దితే బొమ్మ విలువను రెట్టింపు ధరకు విక్రయించుకోవచ్చు. **- వసంత, బొమ్మల కళాకారిణి, లక్ష్మీగారిపల్లె**



బొమ్మలు కొనుగోలు చేస్తే మేలు : చెక్క బొమ్మలను ఇంత అందంగా రూపొందించవచ్చని ఊహించలేదు. సాధారణ పద్ధతుల్లో తయారు చేసిన బొమ్మలకు దుస్తులు, అలంకరణలు అమర్చడం, రంగులు వేయడం ద్వారా అవి మరింత అందాన్ని సంతరించుకుంటున్నాయి. లేపాక్షి హస్తకళల సంస్థ ద్వారా బొమ్మలు కొనుగోలు చేస్తామని చెబుతున్నారు. ఆ ప్రక్రియను నిరంతరాయంగా కొనసాగిస్తే ఆర్థిక చేయూత లభిస్తుంది. **- మధురిమ, బొమ్మల కళాకారిణి, లక్ష్మీగారిపల్లె**



మహిళల్లో ఎంతో సృజనాత్మకత ఉంది ; హస్తకళల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో చెక్క బొమ్మలకు అదనపు హంగులు అద్దడంపై రెండు నెలలుగా శిక్షణ ఇచ్చాం. సాధారణంగా 12 అంగుళాల బొమ్మ విపణిలో రూ.600 అనుకుంటే.. అదనపు హంగులు అద్దడం ద్వారా సుమారు రూ.1,500కు విక్రయించవచ్చు. దీంతో ప్రభుత్వానికి, కళాకారులకు ఆదాయం లభిస్తుంది. లేపాక్షి సంస్థలు దేశ, విదేశాల్లో ఉన్నాయి. వాటి ద్వారా వీటిని విక్రయిస్తే కళాకారులకు ఎంతో మేలు చేకూరుతుంది. **- పూల శ్రీదేవి, కాన్వాస్ ఆర్టిస్ట్, బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్, రైల్వేకోడూరు**

మిర్చితో మూడింతల లాభం


సాగులో మిరపతోట హేమలత, రైతు

స్ఫూర్తి

రామసముద్రం, న్యూస్‌టుడే: మూగవెరప్పల్లెకు చెందిన మహిళా రైతు హేమలత ఎకరం పొలంలో మిరపసాగు చేపట్టారు. అయిదు ట్రాక్టర్ల పశువుల ఎరువు, రెండు క్వింటాళ్ల వేప, కానుగ పిండి మిశ్రమాన్ని దుక్కిలో కలిపేశారు. 7 వేల (దూమ్ హైబ్రిడ్ రకం) మిరప మొక్కలు నాటారు. బిందు సేద్యంతో నీటిని అందించారు. కాంప్లెక్స్ ఎరువును వేర్లకు నేరుగా అందించారు. రూ.లక్ష పెట్టుబడి కాగా రెండు నెలలుగా దిగుబడి ప్రారంభమైంది. పది రోజులకొకసారి పది క్వింటాళ్లు వస్తోంది. కిలో ధర రూ.40 పలుకుతోంది. మూడు నెలల పాటు వస్తూనే ఉంటుంది. సాగు వ్యయం పోను రూ.3 లక్షల లాభం సమకూరనున్నట్లు ఆమె తెలిపారు.

రైతేరాజు

ప్రశ్న: వాతావరణంలో ఇటీవల వచ్చిన మార్పులతో కొర్ర పంటను అగ్గి తెగులు ఆశించింది. నివారణ చర్యలను తెలియజేయండి?
- పి.సాంబశివయ్య, రైతు, రాచపల్లె

సమాధానం: వర్షాలు కురవడంతో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. పంటకు కావాల్సిన సూర్యరశ్మి అందటం లేదు. ఆకాశంలో కారుమబ్బులు ఉండటంతో ఈ చీడ ఉధృతంగా వ్యాప్తి చెందుతోంది. ముందుగా ఎదిగిన మొక్కల కింద ఆకులపై నూలు కండె ఆకారంలో మచ్చలు కన్పిస్తున్నాయి. తెగులు తీవ్రత ఎక్కువగా ఉంటే పత్రాలపై మచ్చలు అధికంగా ఏర్పడతాయి. క్రమేనా అవి పెద్దవిగా మారడంతో ఆకులు ఎండి రాలిపోతాయి. కంకులు ఏర్పడిన తర్వాత తెగులు సోకితే కంకి కాడలపై మచ్చలు ఏర్పడి కాండం విరిగి కంకిలో తాలు గింజలు వస్తాయి. తెగులు లక్షణాలు గుర్తించిన వెంటనే రైతులు అప్రమత్తమై నివారణ చర్యలు చేపట్టాలి. ట్రైసైక్లోజోల్ 0.6 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- డాక్టర్ ఎం.మాధురి, శాస్త్రవేత్త, వ్యవసాయ పరిశోధన స్థానం - న్యూస్‌టుడే, కడప

బత్తాయి... చీడల అదుపుతో ఆదాయమేనోయి


రసం పీల్చేసిన కాయ

రాజంపేట పట్టణం, న్యూస్‌టుడే: బత్తాయి తోటల్లో వాతావరణంలో వస్తున్న మార్పులతో తెగుళ్లు సోకి పురుగులు దాడి చేయడంతో కాయల నాణ్యత దెబ్బతింటోంది. సకాలంలో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపడితే ఉత్పత్తి మరింత పెరుగుతుందని ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు ఎస్.మానస, డాక్టర్ ఎ.వీరయ్య సూచించారు. ఇటీవల మంగునల్లి సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. ఈ రసం వ్యాప్తి చెందటంతో దిగుబడిలో 30-35 శాతం దిగుబడి తగ్గిపోతుంది. మంగుకు నివారణ చర్యలు కంటే ముందు జాగ్రత్త చర్యలు పాటించడం ముఖ్యం.

నివారణ: మంగునల్లి నివారణకు కాయలు గోళీకాయ దశలో ఒకసారి, తర్వాత నిమ్మకాయ పరిమాణంలో రెండోసారి పిచికారీ చేయాలి. మందులను మార్చి మార్చి పిచికారీ చేయాలి. ఇథియాన్ మి.లీ లేదా ప్రొపర్‌గైట్ మి.లీ లేదా ఫెంజాక్విన్ మి.లీ చొప్పున 0.5 మి.లీ జిగురు (స్టికర్)తోపాటు లీటరు నీటికి కలిపి చెట్టంతా బాగా తడిచేలా పిచికారీ చేయాలి.


కాయలపై ఏర్పడిన మంగు

రసం పీల్చే సీతాకోకచిలుక: కాయలు పక్వానికి వచ్చే సమయంలో ఎక్కువగా పండు రసం పీల్చే సీతాకోకచిలుక పురుగుల దాడి ఎక్కువగా ఉంటుంది.

నివారణ: తోటలో రాలిన కాయలను ఏరివేసి గోతిలో పాతిపెట్టాలి. హెక్టారుకు ఒక ఫ్లోరోసెంట్ బల్బును కాయలు పక్వానికి రాక ముందే అనగా ఒక నెల ముందు నుంచి ప్రతిరోజూ రాత్రి 7 గంటల నుంచి ఉదయం ఆరు గంటల వరకు పెట్టాలి. కాయలకు ఉన్న పుచ్చి తాటాకు బుట్టను కట్టడంతో పురుగు నుంచి రక్షణ ఉంటుంది. కాయల కోతకు ఒక నెల లేదా నెలన్నర ముందు నుంచి మలాథియాన్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి.

బంక: బంక కారి కప్పిన బెరడును పూర్తిగా గోకి బోర్డో మిశ్రమం లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్, మాంకోజెబ్ పేస్టును పూయాలి. క్రమం తప్పకుండా ముందు జాగ్రత్తగా బోర్డో పేస్టు మొదళ్లకు పట్టించాలి. కొమ్మలపై వచ్చే బంక తెగులు నివారణకు లీటరు నీటికి కార్బండిజమ్ గ్రాములు కలిపి చెట్టుపై 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. మాంకోజెబ్ 3 గ్రాములు లీటరు నీటికి కలిపి మందు ద్రావణం చెట్టు పాదుల్లో పోయాలి.

గజ్జి తెగులు: బ్యాక్టీరియా ప్రభావంతో ఆకులపై మచ్చలు ఏర్పడతాయి. క్రమేనా ఉధృతి పెరిగి కొమ్మలు, రెమ్మలు, కాండంపై వ్యాప్తి చెందుతుంది. కాయల దిగుబడి గణనీయంగా తగ్గుతుంది. విపణిలో వినియోగదారులు పెద్దగా కొనుగోలు చేయరు.


ఆకులపై ఏర్పడిన మసి

నివారణ: కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు, స్ట్రెప్టోసైక్లిన్ 0.3 గ్రాములు మిశ్రమాన్ని లీటరు నీటికి కలిపి నెల రోజుల వ్యవధిలో 3-4 సార్లు పిచికారీ చేయాలి.

ఆకుకూరల సాగులో తెగుళ్ల నివారణ

చిట్కా...

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: తోట, పాలకూరను తుప్పు తెగులు ఆశించింది. ఈ చీడ సోకితే మొదట ఆకులపై ఉబ్బెత్తుగా, మెరుపుతో 1, 2 మి.మీ పరిమాణం కలిగి ఉంటాయి. ఉధృతి పెరిగేకొద్దీ పొక్కులు మొదట ఏర్పడిన చోటే చుట్టూ చేరి ఎక్కువ సంఖ్యలో కన్పిస్తాయి. నివారణకు 1 శాతం బోర్డోమిశ్రమం చల్లాలి. చుక్కకూర, పాల కూరల్లో బూజు చీడ వ్యాప్తి చెందుతుంది. ఆకుల పైభాగంలో పసుపు లేదా గోధుమ రంగు మచ్చలు వస్తాయి. ఇవి కింది ఆకుల నుంచి మొదలు పెట్టి క్రమేపీ పైభాగానికి పాకుతాయి. చీడ సోకిన ప్రదేశాలు చనిపోయిన ముదురు గోధుమ రంగులో ఉంటాయి. లేత ఊదా రంగులో బూజు పెరుగుదల కనిపిస్తోంది. ఇది భూమిలో బీజాలా రూపంలో విత్తనాన్ని ఆశిస్తోంది. చల్లని వాతావరణం అనుకూలం. ఆరోగ్యవంతమైన వంగడాలను ఎంపిక చేసుకోవాలి. ఆంత్రాక్నోస్ చీడ పాల కూరలో ఆకుమచ్చలు చిన్నగా ముదురు ఆలీవ్ రంగులో లేదా నీటిమచ్చలుగా కన్పిస్తాయి. మచ్చలు పెరుగుతున్నకొద్దీ ఆకారం ఆకులు ఆకారం కోల్పోతాయి. ఒక పరిమాణం లేక మాడినట్లు ఉంటాయి. తర్వాత ఆకు అంతా వ్యాప్తి చెంది మొక్కలు ఎండిపోతాయి. ముదురు నిల్వ లేకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. మాంకోజెబ్ 2.5 గ్రాములు లీటరు నీటికి 7-10 రోజుల వ్యవధిలో చల్లాలి. కొన్ని మొలక వచ్చిన తర్వాత కాండం మొదలులో నల్లమచ్చలు రావడంతో నేలపై ఒరిగిపోతాయి. థైరం 3 గ్రాములు, మీటాలక్సిన్ 6 గ్రాములు కిలో విత్తనానికి పట్టించి విత్తనశుద్ధి చేయాలి.
- జ్యోతిర్మయి, ఉద్యానాధికారిణి, కడప

పట్టాలెక్కని ప్యాసింజర్ రైలు

- సరకు రవాణాకే ఓబులవారిపల్లె-కృష్ణపట్నం మార్గం పరిమితం
- రైళ్లు నడపాలని ప్రయాణికులు అయిదేళ్లుగా వేడుకోలు



ఓబులవారిపల్లె రైల్వే జంక్షన్

- న్యూస్‌టుడే, ఓబులవారిపల్లె

కడప, రాజంపేట, కోడూరు ప్రాంతాల నుంచి దగ్గరి దారిలో నెల్లూరుకు వెళ్లేలనే ఉద్దేశంతో ఓబులవారిపల్లె-వెంకటాచలం మధ్య రూ.1,993 కోట్ల వ్యయంతో 82 కి.మీ పొడవున రైల్వే మార్గం నిర్మించారు. 2019లో ఓబులవారిపల్లెలో అప్పటి ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడు ప్రారంభించారు. వెనుకబడిన ప్రాంతమైన జిల్లాకు సామాజిక-ఆర్థికాభివృద్ధికి ఈ మార్గం దోహదపడుతుందని ప్రజలు ఆశించారు. అయితే.. నాటి నుంచి ఇప్పటి వరకు కేవలం రవాణా నిమిత్తం గూడ్స్ రైళ్లను మాత్రమే నడుపుతున్నారు. దీంతో నెల్లూరు వైపు వెళ్లాలనుకునే వారు తిరుపతి వెళ్లి ప్రయాణించాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. ఈ మార్గంలో ప్యాసింజర్ రైళ్లు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పది స్టేషన్లు ఏర్పాటు

వెంటాచలం-ఓబులవారిపల్లె మధ్య కసుమూరు, కొట్టుండిపల్లె, బ్రాహ్మణపల్లె, ఆదురపల్లె, నెల్లెపల్లె, రాపూరు, వెల్లికల్లు, చెర్లోపల్లె, నేతివారిపల్లె, మంగంపేట రోడ్డు ఇలా పది రైల్వే స్టేషన్లు ఏర్పాటు చేశారు. దక్షిణ మధ్య రైల్వే ద్వారా సరకు రవాణాలో కృష్ణపట్నం ఓడరేవు నుంచి నిర్మించిన రైల్వే లైన్ వద్ద ఉన్న వెంకటాచలం రైల్వే స్టేషన్‌లో చెన్నై-హౌరా మెయిన్‌లైన్‌కు అనుసంధానించారు.

ఇదీ సంగతి

ఓబులవారిపల్లె-వెంకటాచలం మధ్య రూ.1,993 కోట్లు వ్యయంతో 82 కి.మీ రైల్వే మార్గం నిర్మించారు. ఈ మార్గంలో చెర్లోపల్లె-వెల్లికల్లు మధ్య దాదాపు 7 కిలోమీటర్లు సొరంగ మార్గంతో నిర్మించడంతో చెన్నై, ముంబయ్ రైలు మార్గంతో అనుసంధానించారు. ఫలితంగా కృష్ణపట్నం పోర్టు-వెంకటాచలం-ఓబులవారిపల్లె రైల్వే లైన్ రెండు ప్రధాన రైలు మార్గాలైన చెన్నై-హౌరా, చెన్నై-ముంబయి మధ్య కీలకమైన అనుసంధాన రైలు మార్గంగా ఉంది. గుంతకల్లు డివిజన్ నుంచి కృష్ణపట్నం ఓడరేవుకు వచ్చే గూడ్స్ రైళ్లకు 72 కిలోమీటర్ల దూరం తగ్గింది. వెంకటాచలం-ఓబులవారిపల్లె మధ్య ఉన్న మొత్తం 82 కిలోమీటర్లు విద్యుద్దీకరణ పనులతో సహా రైల్వే మార్గం నిర్మించారు. ఈ మార్గం సరకు రవాణాలో నికర లాభాలు గడించవచ్చని కృష్ణపట్నం రైల్వే కంపెనీ లిమిటెడ్ (కేఆర్‌సీఎల్) వార్షిక నివేదికలు సైతం వెల్లడిస్తున్నాయి.

రైళ్లు నడపాలి



ఓబులవారిపల్లె-కృష్ణపట్నం మార్గంలో కేవలం సరకు రవాణా కోసమే గూడ్స్ రైళ్లు నడుపుతున్నారు. ప్యాసింజర్ రైళ్లను కూడా నడిపితే ప్రయాణికులకు ఉపయుక్తంగా ఉంటుంది. రాజధాని అమరావతి, ప్రముఖ నగరాలైన విశాఖపట్నం, నెల్లూరులకు వెళ్లేందుకు సులువుగా ఉంటుంది.
- కిరణ్, మంగంపేట

ప్రభుత్వం చొరవ కీలకం



కృష్ణపట్నం, వెంకటాచలం, ఓబులవారిపల్లె మధ్య ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడిపితే ప్రయాణికులకు మేలు చేకూరుతుంది. కడప, రాజంపేట వాసులతో పాటు రైల్వేకోడూరు వాసులు సైతం రాజధాని అమరావతి వెళ్లేందుకు సులువుగా ఉంటుంది. రైల్వే మార్గం ఉన్న ప్యాసింజర్ రైళ్లు ఏర్పాటు చేయకపోవడం బాధాకరం. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలి.
- చిన్నయ్య, సీపీఐ నాయకులు రైల్వేకోడూరు

మార్కెట్‌లో ఆక్రమణలు తొలగించండి

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: వ్యవసాయ మార్కెట్‌యార్డులో అక్రమంగా వేసిన రేకుల షెడ్లను తొలగించాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మార్కెట్‌యార్డు కార్యదర్శిని ఆదేశించారు. ఈ మేరకు సోమవారం నీరుగట్టువారిపల్లెలోని టమాట మార్కెట్‌లో అనుమతి లేకుండా మండీ వ్యాపారులు కొందరు రేకుల షెడ్లు వేస్తున్నారని ఫిర్యాదు రావడంతో ఎమ్మెల్యే తనిఖీ చేశారు. అద్దెభవనాల ఎదుట వారికి కేటాయించిన స్థలం కంటే అదనంగా షెడ్లు వేయడంపై మండిపడ్డారు. అద్దెలు చెల్లించకుండా, అనుమతులు తీసుకోకుండా, రోడ్లపైకి రేకుల షెడ్లు వేస్తున్నారని, దీనిపై మార్కెట్ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. అక్రమాలు జరుగుతున్నా నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామన్నారు. వెంటనే అక్రమ షెడ్లను తొలగించి స్థలాలు లేని లైసెన్సులు కలిగిన మండీ వ్యాపారులు చాలా మంది ఉన్నారని, వీరికి మార్కెట్ నిబంధనల ప్రకారం స్థలాలు కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మార్కెట్ ఆదాయానికి గండి కొట్టే పనులు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మార్కెట్ అధికారులు, వ్యాపారులు, రైతులు పాల్గొన్నారు.


మార్కెట్‌యార్డులో తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

పక్కాగా ఫ్రీహోల్డ్ భూముల పరిశీలన

కురబలకోట, న్యూస్‌టుడే : మండలంలో ఫ్రీ హోల్డ్ భూముల పరిశీలన ప్రక్రియ పక్కాగా జరగాలని తహసీల్దారును సబ్‌కలెక్టరు మేఘ స్వరూప్ ఆదేశించారు. రెవెన్యూ కార్యాలయాన్ని సోమవారం సాయంత్రం తనిఖీ చేశారు. ఇందులో భాగంగా రెవెన్యూ దస్త్రాలను తనిఖీ చేశారు. అనంతరం తహసీల్దారు తపస్వినికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వీఆర్వోలు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.


దస్త్రాలు తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

స్వర్ణాంధ్ర విజన్ ప్రణాళికపై సలహాలు సమర్పించాలి

రాయచోటి, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర-2047 లక్ష్య ప్రణాళిక తయారీకి అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో సోమవారం ఆయన మాట్లాడారు. జిల్లా నుంచి ఇప్పటికే 1.11 లక్షల మంది సలహాలు అందించారన్నారు. అధికారులు, ప్రజలు, యువత, విద్యార్థి, మేధావుల సలహాలు పంచుకునేందుకు మరో రెండు రోజులే అవకాశం ఉందన్నారు. క్యూ ఆర్ కోడ్ ద్వారా ప్రజల ఆలోచనలు, సూచనలు, సలహాలు నమోదు చేయవచ్చన్నారు. అనంతరం జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి వెంకటపెద్దయ్య పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా స్వర్ణాంధ్ర-2047 విజన్‌పై వివరించారు. జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, డీఎఫ్‌వో వివేక్, సబ్ కలెక్టర్లు మేఘస్వరూప్, నైదియాదేవి, ఆర్డీవో రంగస్వామి, అధికారులు పాల్గొన్నారు.

వైద్య కళాశాల సిబ్బంది నిరసన

మదనపల్లె వైద్యం, న్యూస్‌టుడే : మదనపల్లె ప్రభుత్వ సర్వజన బోధన ఆసుపత్రిలో వైద్యకళాశాల సిబ్బందిపై ఆసుపత్రి అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారని హంస డివిజన్ అధ్యక్షుడు, వైద్య కళాశాల ఏఓ పుల్లమ రాజు అన్నారు. ఈ మేరకు సోమవారం ఆసుపత్రి ఆవరణలో వారు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మదనపల్లె వైద్య కళాశాల సిబ్బంది వచ్చి సుమారు ఏడాది అవుతోందన్నారు. అయితే ప్రస్తుతం ఆసుపత్రిలో ఏడీ, ఏఓ, జూనియర్ అసిస్టెంట్లు, లైబ్రరీ అసిస్టెంట్, పీఎం అసిస్టెంట్‌తో పాటు ఆసుపత్రికి సంబంధించిన జనన, మరణ ధ్రువపత్రాలు ఇచ్చే విభాగాన్ని ఒకే గదిలో ఏర్పాటు చేశారన్నారు. 16 మందికి ఒక గదిని మాత్రం కేటాయించి బల్లలు, కుర్చీలు ఇవ్వకపోవడంతో తాము ఇళ్ల వద్ద నుంచి కుర్చీలు తెచ్చుకోవాల్సి వస్తోందని తెలిపారు. కుర్చీలు లేక చాలా మంది సిబ్బంది బయట కూర్చోవాల్సి వస్తోందన్నారు. దీనిపై ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తమ సేవలు ఆసుపత్రికి వద్దనుకుంటే మాతృసంస్థకు పంపిస్తే వెళ్లి పోతామని స్పష్టం చేశారు. మౌలిక వసతులు కల్పించకుండా తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఈ నగేష్‌తో పాటు వైద్య కళాశాల సిబ్బంది పాల్గొన్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

నవోదయలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : జవహర్ నవోదయ విద్యాలయంలో 9, 11వ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి నిర్వహించే ల్యాటరల్ ఎంట్రీ సెలెక్షన్ టెస్ట్ (ఎల్‌ఈఎస్‌టీ) 2025కు అర్హులైన ఉమ్మడి చిత్తూరు జిల్లా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని నవోదయ విద్యాలయం వైస్ ప్రిన్సిపల్ వేలాయుధన్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఇందుకు సంబంధించిన గోడపత్రాలను విద్యాలయంలో ఆవిష్కరించారు. 8, 10వ తరగతుల విద్యార్థులు ఈ పరీక్షకు అర్హులని వివరించారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాల కోసం 89199 56395, 70132 01138లకు సంప్రదించాలని సూచించారు.


గోడపత్రాలు ఆవిష్కరిస్తున్న నవోదయ విద్యాలయ సమితి అధ్యాపకులు

చోరీ కేసులో ఖజానా ఉద్యోగి అరెస్టు

పురాతన బంగారు వస్తువుల స్వాధీనం

రాజంపేట, న్యూస్‌టుడే: ట్రెజరీ లాకర్‌లో భద్రంగా ఉండాల్సిన వస్తువులు చోరీకి గురయ్యాయి.. అనుమానంతో పెట్టిన కేసులో అదే శాఖలో అటెండరుగా పని చేస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి పురాతన బంగారు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం డీఎస్పీ సుధాకర్‌బాబు వివరించారు.. గత నెల 13న ట్రెజరీలో చోరీ జరిగినట్లు ఆ శాఖ అధికారులు గురించి అదే నెల 30వ తేదీ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. ట్రెజరీలో అటెండర్‌గా పనిచేస్తూ కడప ఎరముక్కపల్లిలో నివాసం ఉంటున్న విష్ణువర్ధన్‌రెడ్డిపై అనుమానంతో అదుపులోకి తీసుకుని విచారించగా అతని వద్ద 20.800 గ్రాముల బంగారు నాణేలు, వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వివరించారు. సీఐ యల్లమరాజు, ఎస్‌ఐ లక్ష్మీప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.


నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సుధాకర్‌బాబు

పురాతన నాణేలు చోరీకి గురైన ఘటనలో ట్రెజరీ బాధ్యులైన నలుగురిపై చర్యలు జిల్లా అధికారులు చర్యలు తీసుకున్నట్లు సమాచారం.

అర్జీదారుల సమస్యలు బాధ్యతగా పరిష్కరించాలి

రాయచోటి, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీదారుల సమస్యలను అధికారులు బాధ్యతగా పరిష్కరించాలని జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఆయన అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు.

★ మదనపల్లె మండలానికి చెందిన యశోదమ్మ తన భర్త చనిపోయి ఏడు నెలలు గడిచిందని తనకు ప్రభుత్వం నుంచి అందాల్సిన డబ్బు, ఇతర లబ్ధి అందలేదని వీటిని త్వరగా ఇప్పించాలని విన్నవించారు. ★ మదనపల్లెకు చెందిన రమణమ్మ తన భర్త రోడ్డు ప్రమాదంలో చనిపోయారని అందుకు సంబంధించిన నష్ట పరిహారం ఇప్పించి పింఛను మంజూరు చేయాలని వినతి పత్రం అందజేశారు. ★ జిల్లా వ్యాప్తంగా భూములు సాగు చేసుకుంటున్న దళితులకు పట్టాలు ఇవ్వాలని సీపీఐ రాయచోటి కార్యదర్శి ఎస్.శ్రీనివాసులు వినతి పత్రం అందజేశారు. ★ వేతనాలు అందక పస్తులతో అల్లాడుతున్నామని సమగ్ర శిక్షా ఉద్యోగులు సీపీఎం నాయకులు ఎ.రామాంజులుతో కలిసి ర్యాలీగా వచ్చి జేసీకి వినతి పత్రం అందజేశారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలు విడుదల చేయాలని కోరారు. ★ కురబలకోటకు చెందిన దివ్యాంగుడు మంజునాథ అనే వ్యక్తి తన భూమిని సోదరులు కాజేశారని తనకు భూమిని ఇప్పించి కుటుంబాన్ని ఆదుకోవాలని జేసీకి విన్నవించారు. ★ పౌర సరఫరాల శాఖ హమాలీలకు కూలీ రేట్ల జీవోను ప్రభుత్వం విడుదల చేయాలనే హమీలతో కలిసి ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సాంబశివ కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. డీఆర్వో సత్యనారాయణరావు, ఆర్డీవో రంగస్వామి, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నినాదాలు చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, హమాలీలు

వాహనం ఢీ కొని వృద్ధురాలి మృతి


చిన్నమ్మ (పాతచిత్రం)

ములకలచెరువు, న్యూస్‌టుడే : రోడ్డు దాటుతున్న వృద్ధురాలిని వాహనం ఢీ కొని మృతి చెందిన సంఘటన ములకలచెరువు మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ములకలచెరువు మండలం, వేపూరికోట పంచాయతీ, గురికివారిపల్లికి చెందిన చిన్నమ్మ (73) సోమవారం తెల్లవారుజామున రోడ్డు దాటుతుండగా మదనపల్లె నుంచి వస్తున్న ఓ వాహనం ఢీ కొంది. ప్రమాదంలో చిన్నమ్మకు తీవ్రగాయాలై మృతి చెందారు. వాహన డ్రైవర్ అతివేగంగా, నిర్లక్ష్యంగా వాహనం నడపడంతో ప్రమాదం జరిగిందని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాడిద పాల వంచన కేసులో ముగ్గురి అరెస్టు


కావలపల్లి ఉమాశంకర్ రెడ్డి

హొసపేటె, న్యూస్‌టుడే: కర్ణాటక రాష్ట్రం విజయనగర జిల్లా హొసపేటెలో జెన్నీమిల్క్ పేరిట గాడిదలు, వాటి పాల విక్రయ కంపెనీ కార్యాలయం ప్రారంభించి రైతులను వంచించిన కేసులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురు నిందితులను సోమవారం హొసపేటె పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల్లో నూతలపాటి మురళి (43), కావలపల్లి ఉమాశంకర్ (33), సయ్యద్ మహ్మద్ గౌస్ (27) ఉన్నారు. విజయనగర ఎస్పీ బి.ఎల్.శ్రీహరిబాబు వివరాల మేరకు.. కంపెనీ ఎండీగా పరిచయం చేసుకున్న నెల్లూరులోని వేదాయపాలెంలో కేశవులునగర్‌కు చెందిన నూతలపాటి మురళి, అన్నమయ్య జిల్లా గాలివీడుకు చెందిన కావలపల్లి ఉమాశంకర్ రెడ్డి (మేనేజర్), వైఎస్‌ఆర్ జిల్లా పోరుమామిళ్ల మండలానికి చెందిన సయ్యద్ మహ్మద్ గౌస్ (సూపర్‌వైజర్)లతో కలిసి మే నెలలో హొసపేటె బస్‌డిపో మార్గంలో జెన్నీమిల్క్ అనే కంపెనీ కార్యాలయాన్ని ప్రారంభించి సిబ్బందిని నియమించారు. రూ.3 లక్షలిస్తే మూడు గాడిదలు (ఒక యూనిట్) ఇస్తాం, వాటి పాలను లీటరు రూ.2350కి కొంటామని ప్రచారం చేపట్టారు. గత నెల 17 వరకు సుమారు 318 మంది రైతులు 484 యూనిట్లు కొన్నారు. ఇందుకు సిబ్బంది సుమారు రూ.10 కోట్లు తీసుకున్నారు. స్థానికుల ఫిర్యాదుతో ఆ కంపెనీకి అనుమతిలేదని నిర్ధారించి 18న నగర సభ అధికారులు దాడులు చేసి పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల్ని అరెస్టు చేశారు. ఈ కేసులో మరికొంత మంది ప్రమేయం ఉందని వారిని కూడా అరెస్టు చేస్తామని ఎస్పీ తెలిపారు.

పోలీసుల అదుపులో అనుమానితుడు?

కొలిక్కి రానున్న సీఐ తల్లి అదృశ్యం కేసు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : సీఐ తల్లి అదృశ్యం కేసు కొలిక్కి రానుంది. శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం సీఐ నాగేంద్రప్రసాద్ తల్లి స్వర్ణకుమారి మదనపల్లె మండలం కోళ్లబైలు పంచాయతీలోని జగన్‌కాలనీలో నివాసం ఉన్నారు. గత నెల 29న కనిపించకుండాపోయిన విషయం విదితమే. ఆమె కుమారుడి ఫిర్యాదు మేరకు మదనపల్లె రూరల్ పోలీసులు ఈ నెల 2వ తేదీన మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి విచారణ ప్రారంభించిన పోలీసులకు విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. స్వర్ణకుమారి ఉంటున్న ఇంటి సమీపంలోనే ఉండే వెంకటేష్ అనే యువకుడు ఆమెను ద్విచక్రవాహనంపై మాంత్రికుడిని కలిసేందుకు తీసుకెళ్లినట్లు తెలిసింది. వెంకటేష్ ఒక్కడే తిరిగి రావడం, అప్పటి నుంచి స్వర్ణకుమారి కన్పించకపోవడం, మరుసటి రోజు నుంచి వెంకటేష్ పరారయ్యాడు. అతను చరవాణి పని చేయకపోవడం, ఎవరికి దొరకకుండా తిరగడంతో స్వర్ణకుమారి అదృశ్యంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దీనిపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. సోమవారం వెంకటేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అయితే స్వర్ణకుమారి అదృశ్యం కేసు కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.

కాళ్లు చేతులు కట్టేసి... కృష్ణా నదిలో తోసేసి

- వాటా డబ్బులు అడిగాడని వ్యాపార భాగస్వామి హత్య
- హైదరాబాద్‌లో అపహరణ... కొత్తకోటలో ఘాతుకం
- అయిదుగురి అరెస్టు.. పరారీలో ప్రధాన నిందితుడు

జీడిమెట్ల, న్యూస్‌టుడే: వ్యాపారం నుంచి తప్పుకొన్న భాగస్వామి తన వాటా డబ్బులు తిరిగివ్వమని అడగ్గా ఇష్టం లేని స్నేహితుడే అతడ్ని కిరాయి వ్యక్తులతో అపహరించి.. కాళ్లు చేతులు కట్టేసి కృష్ణా నదిలో పడేసి హత్య చేయించాడు. మేడ్చల్ జిల్లా జగద్గిరిగుట్ట ఠాణా పరిధిలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు అయిదుగురిని అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నాడు. ఇన్‌ఛార్జి డీసీపీ కోటిరెడ్డి సోమవారం వివరాలు వెల్లడించారు. విశాఖపట్నం జిల్లా భీమిలికి చెందిన వెంకటప్పన్నరెడ్డి(54) భార్య, ఇద్దరు కుమారులతో ఈస్ట్‌సాయినగర్‌లో ఉంటున్నారు. మెఘా ఇంజినీరింగ్ సంస్థలో ఏజీఎంగా పనిచేస్తున్నారు. ఈ నెల 4న విధులకు వెళ్లి. . రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో భార్య హేమ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాల ఆధారంగా స్నేహితుడే అపహరించినట్లు గుర్తించారు. అన్నమయ్య జిల్లా కలికిరి మండలానికి చెందిన బత్తిన ద్వారకానాథ్‌రెడ్డి వెంకటప్పన్నరెడ్డికి విశాఖపట్నంలో పరిచయమయ్యాడు. ఇద్దరు 2021-22లో కాకినాడ పోర్టులో క్యాటరింగ్, క్లీనింగ్ సర్వీస్ వ్యాపారం చేశారు. లావాదేవీల్లో విభేదాలు వచ్చాయి. భాగస్వామి వాటా డబ్బులు రూ.28 లక్షలు చెల్లించేందుకు ద్వారకానాథ్‌రెడ్డి అంగీకరించాడు. నెలలు గడుస్తున్నా ఇవ్వకపోవడంతో ఇటీవల ద్వారకానాథ్‌రెడ్డి ఇంటికి వెళ్లి తన డబ్బులివ్వాలని వెంకటప్పన్నరెడ్డి నిలదీశారు. డబ్బు ఇవ్వడం ఇష్టం లేక, కుటుంబ సభ్యుల ముందు నిలదీయడంతో పరువు పోయిందని స్నేహితుడిని హత్య చేసేందుకు పథకం వేశాడు. వైఎస్సార్ జిల్లా వేంపల్లె మండలానికి చెందిన సుధాకర్‌రెడ్డికి విషయం చెప్పాడు. అదే ప్రాంతానికి చెందిన పాశం ప్రసాద్, బుసుపాటి కిరణ్ కుమార్, గడ్డం వెంకటసుబ్బయ్య, అన్నిక మణికంఠలకు రూ.10 వేలు చొప్పున చెల్లించి హత్యకు ఒప్పందం చేసుకున్నాడు. వారు ఈ నెల 4న ద్విచక్ర వాహనంపై ఇంటికెళ్తున్న వెంకటప్పన్నరెడ్డిని కూకట్‌పల్లి వద్ద అడ్డుకుని క్లోరోఫాం చల్లి కారులో జోగులాంబ గద్వాల జిల్లా కొత్తకోట తీసుకెళ్లారు. కాళ్లు, చేతులు కట్టేసి బీచుపల్లి బ్రిడ్జి మీద నుంచి కృష్ణానదిలో పడేశారు. భార్య ఫిర్యాదుతో ద్వారకానాథ్‌రెడ్డి గురించి ఆరా తీయగా అతడు నగరానికి వచ్చినట్లు సాంకేతిక ఆధారాల ద్వారా తెలిసింది. సీసీ కెమెరాలను జల్లెడ పట్టి అపహరించి కొత్తకోట తీసుకెళ్లినట్లు గుర్తించారు. అక్కడ లాడ్జిలో ఉన్న సుధాకర్‌రెడ్డి ముఠా దొరికింది. పడేసిన చోటు నుంచి 15 కి.మీ. దూరంలో మృతదేహం తేలింది. సమావేశంలో అదనపు డీసీపీ సత్యనారాయణ, బాలానగర్ ఏసీపీ హనుమంతరావు, జగద్గిరిగుట్ట ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్ ఉన్నారు.

మదనపల్లె

•మదనపల్లె •పీలేరు •తంబళ్లపల్లె

భూ ఆక్రమణలపై చర్యలు


అధికారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ ఖాజాబీ

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే : రెవెన్యూ సమస్యలకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని తహసీల్దార్ ఖాజాబీ వీఆర్వోలను ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం గ్రామ రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. భూఆక్రమణలు, చెరువుల ఆక్రమణలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, అక్రమ ఇసుక, మట్టి రవాణా, తవ్వకాలపై వీఆర్వోలు క్షేత్రస్థాయిలో పరిశీలించి అడ్డుకట్ట వేయాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రెడ్డెప్ప, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండును శుభ్రంగా ఉంచండి

మదనపల్లె అర్బన్, న్యూస్‌టుడే : ఆర్టీసీ బస్టాండును నిత్యం శుభ్రంగా ఉంచాలని జిల్లా ప్రజారవాణా అధికారి రాము రెండు డిపోలకు చెందిన పర్యవేక్షకులను ఆదేశించారు. స్థానిక బస్టాండును సోమవారం తనిఖీ చేశారు. అనంతరం ఆయా డిపోలకు చెందిన పర్యవేక్షకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమావేశంలో డీఎం ఎం.వి.రమణారెడ్డి, పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.


సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా ప్రజారవాణా అధికారి రాము, పక్కన డీఎం రమణారెడ్డి, అధికారులు

మేమున్నాం... మీకు తోడుగా...

(10 AM to 1 PM)
మదనపల్లె : 8008574611
పీలేరు : 8008574958
తంబళ్లపల్లె : 8008574612

స్పందనకు వందనం

పీలేరు పట్టణం అయ్యప్ప పురెడ్డికాలనీలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఇక్కడ ఆరు నెలలుగా పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో మురుగు వ్యర్థ అస్తవ్యస్తంగా మారడంపై మేమున్నాం మీకుతోడుగాలో భాగంగా సమస్య ప్రచురితమైంది. స్పందించిన ఈవో గురుమోహన్ కార్మికులతో పారిశుద్ధ్య పనులు చేయించారు. - న్యూస్‌టుడే, పీలేరు గ్రామీణ

?: మండలంలోని గుడిసివారిపల్లె గ్రామం తిరుపతి మార్గంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట చెత్తచెదారం వేస్తున్నారు. దీంతో దోమల నిలయంగా మారింది. - సుబ్రహ్మణ్యం, సీటీయం రోడ్డు
✓: పారిశుద్ధ్య పనులు చేయించి సమస్య లేకుండా చూస్తాం. - గిరి, సచివాలయ కార్యదర్శి, కొత్తవారిపల్లె, మదనపల్లె

?: పుంగనూరురోడ్డులోని కళ్యాణ మండపం ఎదుట పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. దుకాణాలు, చిల్లరదుకాణాలు, హోటళ్ల నుంచి వచ్చే వ్యర్థాలు ఇక్కడ వేస్తున్నారు. - చంద్రమౌళి, పుంగనూరురోడ్డు, మదనపల్లె
✓: పారిశుద్ధ్య పనులు చేపట్టి, చెత్తను సంపద కేంద్రానికి తరలిస్తాం. - ప్రమీల, కమిషనర్, పురపాలక సంఘం, మదనపల్లె

?: బయ్యారెడ్డికాలనీకు వెళ్లే మార్గంలో మలుపులో చెత్తగుట్టలు వేశారు. వాహనాల రాకపోకల కారణంగా రోడ్డంతా చెత్త పడుతోంది. దీంతో అధ్వానంగా ఉంది. - బషీర్, బయ్యారెడ్డికాలనీ
✓: చెత్తదిబ్బలు లేకుండా పంచాయతీ కార్మికులతో శుభ్రం చేయిస్తాం. - మస్తాన్‌వల్లి, ఎంపీడీవో, మదనపల్లె,

- న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణ


భూ సమస్యలపై ఫిర్యాదుల వెల్లువ

పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డీపీవో ఆదేశం


అర్జీదారులను విచారిస్తున్న డీపీవో పద్మావతమ్మ

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే : సమస్యలను పరిష్కరించి నివేదిక పంపాలని మండల అధికారులను సబ్‌కలెక్టర్ కార్యాలయం డీపీవో పద్మావతమ్మ ఆదేశించారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరిగింది. సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ జిల్లా కేంద్రానికి క్యాంపు నిమిత్తం వెళ్లడంతో కార్యాలయ డీపీవో పద్మావతమ్మ ప్రజా సమస్యలపై విచారణ చేశారు. భూ సమస్యలు, పింఛను సమస్యలపై పలువురు అర్జీలు ఇచ్చారు. వీటిపై విచారించి నివేదిక ఇవ్వాలని డీపీవో అధికారులను సూచించారు.

రోడ్డు, మురుగు కాలువల ఆక్రమణ




చక్రాల వాహనంలో ఇంటికి వెళ్లేందుకు దారి, కాలువలు ఆక్రమించుకోవడంతో ఇబ్బందిగా మారింది. అనారోగ్యంతో రెండుకాళ్లు లేవు. నా ఇంటిలోకి వెళ్లాలంటే దారి ఆక్రమణకు గురికావడంతో వీల్‌చైర్ వెళ్లే పరిస్థితి లేదు. ఇళ్ల ముందర మెట్లు కట్టడంతో ఇబ్బందిగా మారింది. - లక్ష్మీపతి, వాల్మీకిపురం

ఇంటి నిర్మాణానికి ఇబ్బంది




మదనపల్లె మండలం సీటీయం గ్రామం సంజీవ్‌నగర్‌లో ఇంటి స్థలం ఉంది. ఇంటి నిర్మాణానికి సర్వే నిమిత్తం చలానా చెల్లించాను. సర్వేయర్ల చుట్టూ తిరుగుతున్నా సరిహద్దులు చూపకపోవడంతో ఏడాదిగా ఇంటి నిర్మాణం చేపట్టలేకపోతున్నాను. సమస్య పరిష్కరించండి. - చక్రధర్, సీటీయం

రెండేళ్లుగా ఎదురుచూపులు



మదనపల్లె మండలం గంగన్నగారిపల్లె సమీపంలో కుంట స్థలం ఉంది. ఇందులో వ్యవసాయం చేస్తున్నాను. వరి, టమాట పంటలు సాగుచేసుకుంటూ కుటుంబ పోషణ సాగిస్తున్నాను. భూమి సరిహద్దులు చూపాలని సర్వేయర్ల కోసం రెండేళ్లుగా తిరుగుతున్నా. సర్వే కోసం సచివాలయంలో చలానా చెల్లించాను. అధికారులు పట్టించుకోవడం లేదు. - వెంకటరమణ, గంగన్నగారిపల్లె, మదనపల్లె

మూడేళ్లుగా తిరుగుతున్నా



నాకు నిమ్మనపల్లెలో కొండ్రెడ్డిగారిపల్లెలో రెండు వేర్వేరు సర్వే నంబర్లలో వ్యవసాయ భూమి ఉంది. భూమిని సక్రమంగా కొలవకపోవడంతో సరిహద్దుల్లో నా భూమి ఆక్రమణకు గురవుతోంది. ఒక్కొక్క సర్వేయరు ఒక్కో విధంగా రాళ్లు నాటుతున్నారు. పలుమార్లు సర్వే నిమిత్తం చలానా కూడా చెల్లించాను. పక్కాగా సర్వేచేయాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నాను. - గోవిందు, కొండ్రెడ్డిగారిపల్లె

సనాతన ధర్మ పరిరక్షణకు ముందుకు రావాలి

పీలేరు గ్రామీణ: కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర సన్నిధిలో సనాతన ధర్మ పరిరక్షణకు శాశ్వత కమిటీ నియామకం చేపట్టాలని హౌసింగ్ బోర్డు మాజీ డైరెక్టర్ కారపాకుల భాస్కర్‌యుడు అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన పీలేరులో మాట్లాడారు. సనాతన ధర్మ పరిరక్షణకు జనసేన పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇచ్చిన పిలుపునకు ప్రతి హిందువు ముందుకు రావాలన్నారు. టెలికం మాజీ బోర్డు సభ్యుడు శేషాద్రినాయుడు, భాజపా గుర్రంకొండ అధ్యక్షుడు రామాంజులు, అక్కులప్ప పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సమస్యల పరిష్కారానికి విన్నపం

మదనపల్లె గ్రామీణ: అంగన్‌వాడీ కార్యకర్తలు, కార్యాలయాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రాజేశ్వరి డిమాండు చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మధురవాణి, విజయ, గంగాదేవి సోమవారం సాయంత్రం విధులు ముగించుకుని సీడీపీవో సుజాతకు అర్జీ సమర్పించారు.

క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కరించండి


తహసీల్దారుకు సమస్యలు తెలియజేస్తున్న తెదేపా రాష్ట్ర కార్యదర్శి కొండ్రెడ్డి, నాయకులు

ములకలచెరువు, న్యూస్‌టుడే: మండలంలో నెలకొన్న రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని తెదేపా రాష్ట్ర కార్యదర్శి కొండ్రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం తెదేపా రాష్ట్ర కార్యదర్శి కొండ్రెడ్డి తంబళ్లపల్లె తహసీల్దార్ హరిప్రసాద్ దృష్టికి పలు సమస్యలు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కొండ్రెడ్డి మాట్లాడుతూ.. గత వైకాపా పాలనలో రైతుల భూ సమస్యలు పరిష్కారం కాలేదని ఆరోపించారు. రైతుల నుంచి వచ్చే రెవెన్యూ భూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. తాతిరెడ్డి, చంద్రశేఖర్, రాంమోహన్‌రెడ్డి, రెడ్డెప్ప పాల్గొన్నారు.

దాడి ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : మహిళపై కత్తితో దాడి చేసి గాయపరిచిన ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. మదనపల్లె మండలం అరవవాండ్లపల్లెకు చెందిన శ్రావణిపై అదే గ్రామానికి చెందిన బంధువులు భూ వివాదం విషయమై ఆదివారం రాత్రి పాపయ్య, అతని కుటుంబ సభ్యులు కత్తితో దాడిచేసి గాయపరిచారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన ఆమెను కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించగా ఆమెను సోమవారం మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి రెఫర్ చేశారు. ఈ దాడి విషయమై పాపయ్య మరో ఇద్దరు మహిళలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. శ్రావణి గాయపడిన విషయం తెలుసుకున్న వైకాపా నియోజకవర్గ బాధ్యుడు నిస్సార్ అహ్మద్ ఆసుపత్రి వద్దకు చేరుకుని ఆమెను పరామర్శించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బి.కొత్తకోట మండలం తాకాటంవారిపల్లెకు చెందిన భవన నిర్మాణ కార్మికుడు నాగరాజు సోమవారం ఉదయం కూలీపనుల కోసం ద్విచక్రవాహనంపై వెళ్తుండగా గ్రామ సమీపంలో అదుపుతప్పి పడ్డారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయన్ను స్థానికులు మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ● మదనపల్లె పట్టణంలోని రామారావుకాలనీకి చెందిన నరేష్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి గౌతమినగర్ వద్ద మిట్ట ప్రాంతంలో వెళ్తుండగా ట్రాకర్టు అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయన్ను కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రెండోపట్టణ పోలీసులు విచారణ చేస్తున్నారు.

చెరువుల అభివృద్ధికి కృషి



పీలేరు, న్యూస్‌టుడే: పీలేరు జలవనరుల శాఖ డీఈగా ఎం. సేవలానాయక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన తాటిపర్తి నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న డీఈ ప్రసన్నకుమారి కదిరికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సేవలానాయక్ మాట్లాడుతూ జలవనరులశాఖ ఆధ్వర్యంలోని చెరువుల అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. పీలేరు, కంభంవారిపల్లె, కలకడ మండలాల్లోని జలవనరులశాఖ ఆధ్వర్యంలోని నీటి వనరులను పరిశీలించి అభివృద్ధికి ప్రతిపాదనలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపుతానని తెలిపారు.

మద్యం అక్రమ రవాణను అరికడతాం



ములకలచెరువు, న్యూస్‌టుడే: ములకలచెరువు ఎక్సైజ్ సీఐగా మాధవి సోమవారం బాధ్యతలు చేపట్టారు. చిత్తూరు జిల్లా నగిరి ఎక్సైజ్ సీఐగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాధవి మాట్లాడుతూ.. ములకలచెరువు సర్కిల్ పరిధిలో నాటుసారా తయారీకి అడ్డుకట్ట వేస్తామన్నారు. కర్ణాటక మద్యం సరఫరా చేయకుండా చర్యలు తీసుకుంటామన్నారు. సర్కిల్ పరిధిలో 9 మద్యం షాపులు ఉన్నాయని వాటికి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఆర్ఐగా బాధ్యతల స్వీకరణ

రామసముద్రం: రామసముద్రం ఆర్ఐగా వసీమ్‌అహ్మద్ నియమితులయ్యారు. సోమవారం ఆయన ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. పుంగనూరు తహసీల్దార్ కార్యాలయం నుంచి ఇక్కడకు వచ్చారు.

పంచాయతీ ఈవోలు...

కలికిరి: కలికిరి మేజరు పంచాయతీ ఈవోగా అశోక్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఈవో గురుమోహన్‌ను పీలేరుకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో పులిచెర్ల ఈవోగా పనిచేస్తున్న అశోక్ ఇక్కడికి వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అశోక్‌ను ఇన్‌ఛార్జి సర్పంచి ఎల్లయ్య, అభివృద్ధి కమిటీ సభ్యుడు యోగేష్‌రెడ్డి, తెదేపా నాయకులు, సిబ్బంది సత్కరించారు.

పీలేరు గ్రామీణ : పీలేరు మేజర్ పంచాయతీ ఇన్‌ఛార్జి ఈవోగా విధులు నిర్వహించే గురుమోహన్‌ను రెగ్యులర్ ఈవోగా నియామకం అయ్యారు. ఈ మేరకు సోమవారం జిల్లా స్థాయి ఉన్నత అధికారుల నుంచి ఉత్తర్వులు అందాయి.

కమనీయం... అమ్మరూపం

దసరా నవరాత్రుల సందర్భంగా మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాల వ్యాప్తంగా ఆయా ఆలయాల్లో సోమవారం అంగరంగ వైభవంగా పూజలు నిర్వహించారు. వివిధ రూపాల్లో అమ్మవార్లను అలంకరించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని పూజలు చేశారు. నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. - న్యూస్‌టుడే, మదనపల్లె క్లస్టర్ బృందం


గండబోయనపల్లెలో మహాచండీశ్వరీ దేవి అలంకరణలో సత్యమ్మ



గుర్రంకొండ : చెర్లోపల్లెలో మహాలక్ష్మీగా రెడ్డెమ్మదేవత


కురబలకోటలో అన్నపూర్ణాదేవిగా వాసవీమాత


మహాచండీ దేవిగా కలికిరి ఎల్లమ్మ


బి.కొత్తకోటలో పూజలందుకుంటున్న అమ్మవారు


రామసముద్రం: తిరుమలరెడ్డిపల్లెలో మారెమ్మ


మదనపల్లెలో దుర్గాదేవి అలంకారంలో కన్యకాపరమేశ్వరి

అర్హులకు సంక్షేమ పథకాలు అందించండి


తంబళ్లపల్లె ఎంపీడీవో ఉపేంద్రరెడ్డిని సన్మానిస్తున్న కూటమి నేతలు


నిమ్మనపల్లె ఎంపీడీవో పరమేశ్వరరెడ్డిని సత్కరిస్తున్న తెదేపా నాయకులు

ములకలచెరువు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంలో అమలయ్యే సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందించాలని తెదేపా నాయకులు ఎంపీడీవోను కోరారు. తంబళ్లపల్లె ఎంపీడీవోగా నూతనంగా విధుల్లో చేరిన ఉపేంద్రరెడ్డిని సోమవారం కూటమి నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా మండలంలోని పంచాయతీలలో నెలకొన్న తాగునీటి సమస్యను నేతలు ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, సిద్దమ్మ, నాయకులు సోముశేఖర్, తులసీదర్‌నాయుడు, రామచంద్ర, నరసింహులు, స్వామిరెడ్డి, రామలింగారెడ్డి పాల్గొన్నారు.

నిమ్మనపల్లె : నిమ్మనపల్లె ఎంపీడీవోగా పరమేశ్వరరెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. కలకడ మండల ఎంపీడీవోగా ఉన్న ఈయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీవో షాలెట్ నెల్లూరుకు బదిలీపై వెళ్లారు. అధికారులు, ప్రజా ప్రతినిధుల సమన్వయంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానని నూతన ఎంపీడీవో తెలిపారు. కొత్తగా విధుల్లోకి చేరిన ఎంపీడీవోకు తెదేపా మండల అధ్యక్షుడు పుర్రావెంకటరమణ, రాజంపేట పార్లమెంటరీ సాధికార బీసీ ప్రతినిధి లక్ష్మన్న స్వాగతం పలికారు.

రామసముద్రం ఎంపీడీవోగా భానుప్రసాద్



రామసముద్రం: రామసముద్రం ఎంపీడీవోగా భానుప్రసాద్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన మదనపల్లె నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీవో నారాయణ స్వామి ఉద్యోగ విరమణ చేశారు.

నాటుసారా స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న సారా ఊట

రామసముద్రం: అరికెల గ్రామపంచాయతీ దాసిరెడ్డిపల్లె గ్రామసమీపంలోని అటవీప్రాంతంలో తయారు చేస్తున్న నాటుసారా బట్టీపై సోమవారం పోలీసులు దాడులు చేశారు. 50 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీ సామగ్రిని ధ్వంసం చేశారు. నిందితుడు హరీష్‌నాయక్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటసుబ్బయ్య తెలిపారు.

జలవనరులు కలుషితం... పారిశుద్ధ్యం అధ్వానం

చెరువులు, వంకల్లో పేరుకుపోయిన వ్యర్థాలు


తట్టివారిపల్లె చెరువులో చెత్త

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే : జలవనరులుగా ఉన్న చెరువులు పర్యావరణ పరిరక్షణ లోపంతో కలుషితమవుతున్నాయి. ఇళ్ల నుంచి వెలువడే చెత్తచెదారం గ్రామాల్లోని చెరువుల్లో, వంకల్లో వేస్తున్నారు. మదనపల్లె డివిజన్‌లోని గ్రామాల సమీపంలో ఉన్న చెరువులు, వంకల్లో నీరు కలుషితమవుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

● మదనపల్లె మండలంలోని సీటీఎం రోడ్డులో తట్టివారిపల్లెచెరువు పట్టణానికి సమీపంలో ఉంది. ఇక్కడకు సీటీఎం రోడ్డు, శివాజీనగర్, బాలాజీనగర్ నుంచి కొందరు చెత్తచెదారాన్ని తీసుకొచ్చి ఇందులో వేస్తున్నారు. మాంసం అంగళ్ల నుంచి కోళ్ల వ్యర్థాలు వేస్తున్నారు. అలాగే పురాతన భవనాల నుంచి వ్యర్థాలు డంప్ చేస్తున్నారు. కొత్తవారిపల్లె పంచాయతీ పరిధిలోని పెద్దచెరువు సీటీఎం గ్రామం, నేతాజీకాలనీ వరకు విస్తరించి ఉంది. ఇక్కడ వ్యర్థాలను వేస్తున్నారు. బసినికొండ పంచాయతీలోని రామాచర్లపల్లె వద్ద ఉన్న పెద్దచెరువు, పుంగనూరురోడ్డులోని నక్కలకుంట, బసినికొండ బైపాస్‌రోడ్డు సమీపంలోని పాములచెరువు, స్వామి చెరువు పట్టణానికి సమీపంలో ఉన్నాయి. నిమ్మనపల్లె రోడ్డులోని కొండ వంక పూర్తిగా మురుగునీటి కాలువగా మారింది. చెత్తచెదారంతో నిండిపోయింది. పారిశుద్ధ్య పనులు చేపట్టడం లేదు. ఇసుకనూతిపల్లెలోని బసినికొండచెరువు మురుగునీటితో నిండిపోయింది. నీరుగట్టువారిపల్లెలోని కాట్లాటపల్లె రోడ్డులో అమ్మచెరువు చెత్తతో నిండిపోయింది. గ్రామ పంచాయతీ అధికారులు పారిశుద్ధ్యంపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నామమాత్రంగా చేస్తున్నారని, ఇంటింటా చెత్త సేకరణ పూర్తిస్థాయిలో జరగకపోవడంతో ఈ దుస్థితి ఏర్పడిందని చెబుతున్నారు. మదనపల్లె పట్టణంలోని గజ్జలకుంట, కురవంక, బాహుదా నదికాలువ, బుగ్గ కాలువలు మురుగునీటి కాలువలుగా మారాయి. రామసముద్రం, నిమ్మనపల్లె మండలాల్లోని గ్రామాల సమీపంలో ఉన్న చెరువుల పరిస్థితి, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాల్లోని పట్టణ, గ్రామాల్లో ఉన్న చెరువులు, వంకల పరిస్థితి ఇలానే ఉంది. అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో ఈ ప్రాంతంలో దోమలు, ఈగల నిలయంగా మారింది. చెరువుల కింద తాగునీటి పథకాలున్నాయి. ఎక్కడ కలుషితమవుతాయోనన్ని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.


అమ్మచెరువుకు వెళ్లే కాలువలో వ్యర్థాలు

చర్యలు తీసుకుంటాం



చెరువుల్లో చెత్తచెదారం, వ్యర్థాలు వేయకుండా గ్రామీణ ప్రాంతాల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు అవగాహన కల్పిస్తాం. గ్రామాల్లో ఇంటింటా తడి, పొడి చెత్త సేకరణ సక్రమంగా జరిగేలా కార్యదర్శులతో సమావేశం ఏర్పాటుచేసి చర్యలు తీసుకుంటాం. చెత్తచెదారాన్ని సంపద కేంద్రాలకు తరలించి పంచాయతీలకు ఆదాయం వచ్చేలా చూస్తాం. - నాగరాజు, డీఎల్‌పీవో, మదనపల్లె

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

పెద్దమండ్యం, న్యూస్‌టుడే : మండలంలో ఫ్రీహోల్డ్ భూముల పరిశీలన పక్కాగా చేయాలని హెచ్ఎన్ఎస్ డిప్యూటీ కలెక్టర్ రాఘవేంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు పెద్దమండ్యం తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రెవెన్యూ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సయ్యద్ అహమ్మద్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


దస్త్రాలు పరిశీలిస్తున్న హెచ్ఎన్ఎస్ డిప్యూటీ కలెక్టర్ రాఘవేంద్ర

తపాలా వారోత్సవాలు

పీలేరు : గ్రామీణ ప్రాంత ప్రజలకు తపాలా సేవలు అందించాలని పీలేరు తపాలా శాఖాధికారి వినోద్‌కుమార్ అన్నారు. తపాలా వారోత్సవాలు పురస్కరించుకుని సోమవారం స్థానిక తపాలా కార్యాలయంలో ఆయన సిబ్బంది సమావేశం ఏర్పాటు చేశారు. తపాలా శాఖ అందించే సేవలను వివరించారు.

అధికారుల గైర్హాజరుపై ఛైర్‌పర్సన్ ఆగ్రహం

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : పురపాలకసంఘం కార్యాలయంలో సోమవారం ఉదయం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అధికారులు హాజరు కాకపోవడంతో పుర ఛైర్‌పర్సన్ మనూజ తీవ్రంగా మండిపడ్డారు. కార్యాలయంలో ఎవరున్నారో పిలవాలని సిబ్బందికి ఆదేశాలిచ్చారు. ఆ సమయానికి లోపల ఎవరు లేకపోవడంతో అధికారులపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. 11 గంటలైనా అధికారులు కార్యాలయానికి రాకపోవడంపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. అనంతరం ఆమె ప్రజల నుంచి స్వయంగా ఫిర్యాదులు స్వీకరించారు.

మదనపల్లెను జిల్లా కేంద్రం చేయాలని వినతి


మాట్లాడుతున్న బహుజన యువసేన నాయకులు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : మదనపల్లెను జిల్లాగా చేయడంలో గత వైకాపా ప్రభుత్వం మోసం చేసిందని ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం మదనపల్లెకు న్యాయం చేయాలని బహుజనయువసేన అధ్యక్షుడు పునీత్ డిమాండు చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మదనపల్లె జిల్లా సాధన కోసం జేఏసీ ఆధ్వర్యంలో నిరసన దీక్షలు చేశామని తెలిపారు. మదనపల్లె ప్రాంత ప్రజలు, యువత మనోభావాలను ఏమాత్రం పట్టించుకోకుండా గత వైకాపా ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందని ధ్వజమెత్తారు. ప్రతిపక్ష నేతగా నారా చంద్రబాబునాయుడు మదనపల్లెలో జరిగిన ఎన్నికల బహిరంగసభలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మదనపల్లెను జిల్లాగా ప్రకటిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుత ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అప్పట్లో జిల్లా సాధన సమితిలో క్రియాశీలకంగా పోరాటం చేశారన్నారు. ఎమ్మెల్యే ముఖ్యమంత్రికి ఈ సమస్యను విన్నవించి మదనపల్లెను జిల్లాగా చేయడానికి కృషిచేయాలని కోరారు. త్వరలోనే జిల్లాగా ప్రకటించకుంటే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో బహుజనయువసేన నాయకులు హరీష్, వేణుగోపాల్, ఆది, శశికుమార్, శ్రీధర్, జగదీష్, నందీప్, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

రాయచోటి
• రాయచోటి • రాజంపేట • రైల్వేకోడూరు

అర్హులందరికీ ప్రభుత్వ భూములు అందించాలి


తహసీల్దారుకు వినతి పత్రం అందిస్తున్న బీకేఎంయూ నాయకులు

పుల్లంపేట : అర్హత కల్గిన గిరిజనలందరికి ప్రభుత్వ భూములు పంపిణీ చేయాలని రైల్వేకోడూరు బీకేఎంయూ కార్యదర్శి జయ రామయ్య, ఓబులవారిపల్లె కార్యదర్శి వెంకటరమణ, పుల్లంపేట కార్యదర్శి కృష్ణవేణి డిమాండు చేశారు. సోమవారం స్థానిక తహ సీల్దారు అరవిందకిశోర్‌కు వినతపత్రం అందించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ సర్వేనెంబర్ 855లో 90 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందని గతంలో అధికారులకు వినతులు అందించినా అగ్రవర్ణాల వారికే ప్రాధాన్యత కల్పిస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పేదలకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. అలా జరగని పక్షంలో మేమే ఎర్రజండాలను నాటుతామని హెచ్చరించారు.

యువతకు నైతిక విలువలు నేర్పాలి


గురువును సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

చిన్నమండెం, న్యూస్‌టుడే: నేటి తరానికి నైతిక విలువలు నేర్పాలని చిన్నమండెం బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యా యుడు వీసీ రెడ్డెప్ప, విశ్రాంత ఉపాధ్యాయులు నవనీతమ్మ, రవి, రెడ్డెన్న, గంగాదేవిలు పేర్కొన్నారు. స్థానిక పాఠశాల ఆవ రణలో సోమవారం 1987-88 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. వారు మాట్లాడుతూ ఆ రోజుల్లో ఉపాధ్యా యుడు వస్తున్నారంటే విద్యార్థులు క్రమశిక్షణతో అల్లరి చేయ కుండా బుద్ధిగా ఉండేవారన్నారు. నేడు క్రమశిక్షణ కొరవడుతోందన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థు లకు నైతిక విలువలు నేర్పించాలని కోరారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయులను సన్మానించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
రాజంపేట : 9441872651
రాయచోటి : 9703622242
రైల్వేకోడూరు : 7981695235

?: రాయచోటి పురపాలకలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉంది. కాలువల్లో మట్టి పేరుకుపోవడంతో ఇళ్ల నుంచి వచ్చే నీరంతా రహదారులపై పారుతోంది. **- నరేంద్రకుమార్, మాసాపేట**

✔: ఇటీవల డ్రైనేజీ కాలువల్లోని పూడిక తొలగించాం. మళ్లీ సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి మురుగు నీటి కాలువలు శుభ్రం చేయిస్తాం. రహదారులపై ఏర్పడిన గుంతలు పూడ్చిం చడానికి కౌన్సిల్ సమావేశంలో చర్చించి నిధులు కేటాయిస్తాం.

- వాసుబాబు, మున్సిపల్ కమిషనర్, రాయచోటి

-న్యూస్‌టుడే, రాయచోటి

మాండవ్య కలుషితం

• గరళమైపోతున్న నదీ జలాలు
• శుభ్రతపై దృష్టి సారించని అధికారులు

– న్యూస్‌టుడే, రాయచోటి, రాజంపేట

ప్రజారోగ్యమే మహాభాగ్యమని స్వచ్ఛతకు ప్రాధాన్యం ఇస్తున్నామని ప్రభుత్వాలు పదేపదే చెబు తున్నాయి. జిల్లాలో మూడు పురపాలకలు ఉండగా ఒక్కో పట్టణం మధ్యలో నుంచి ఒక్కో నది ప్రవ హిస్తూ వెళ్తోంది. పట్టణాలలోని ఎత్తు పల్లాల నుంచి వెలువడే మురుగంతా నదుల్లోకి వచ్చి చేరు తోంది. రోజుల తరబడి చెత్తాచెదారం కుళ్లి దుర్వా సన వెదజల్లుతుండడంతో నదుల్లోని నీరు కలుషితం అవుతోంది. పరిసరాల ప్రజలు దుర్వాసనలతో అనా రోగ్యాల పాలవుతున్నారు. నదులను శుభ్రపరిచి ప్రజాఆరోగ్యాన్ని కాపాడాల్సిన పాలకులు సుదీర్ఘ కాలంగా ఉన్న సమస్యకు పరిష్కారం చూపడం లేదు. కూటమి ప్రభుత్వం నదుల శుభ్రతపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని వ్యాధుల బారిన పడుతున్న బాధిత కుటుంబాలు వేడుకుంటున్నాయి.

● పట్టణాలలోని నివాసాల నుంచి వెలువడు తున్న మురుగు నీరు అంతా కాలువల ద్వారా నేరుగా నదుల్లోకి చేరుతోంది. పురపాలక అధికా రులు ముందస్తు ప్రణాళికలు లేకుండానే మురుగు నీటి కాలువలు నిర్మించారు. నదీ పరివాహక ప్రాంతం పల్లంగా ఉండడంతో ఎత్తైన ప్రాంతాల ఇళ్లు, కార్యాలయాలు, పరిశ్రమల నుంచి వచ్చే నీటిని పట్టణాలకు దూరంగా మళ్లించాల్సి ఉంది. కానీ ఎక్కడా అలా చేయకుండానే నేరుగా నదుల వరకు కాలువలు నిర్మించి వదిలేశారు.


రాజంపేటలోని చక్రాలమడుగులో నిల్వ చేరిన మురుగు నీరు

● రాయచోటి పట్టణంలో విస్తరించిన మాండవ్య నది గాలివీడు మార్గంలోని రింగ్ రోడ్డు నుంచి లక్ష్మీపురం, థియేటర్లు, పాతరాయచోటి, మాసాపేట, చెన్నముక్కపల్లి వరకు సుమారు 8 కిలో మీటర్ల మేర విస్తరించింది. పట్టణంలోని 34 వార్డులలో ఉన్న 28 వేల గృహాల నుంచి వెలువడే నీరంతా ఈ నదిలోకే చేరుతోంది. మదనపల్లెలోని బాహుదా, బుగ్గ కాలువ, రాజంపేటలోని చక్రాలమ డుగు దుస్థితి ఇలాంటిదేనని జనం వాపోతున్నారు.

●రాజంపేటలోని 30 వార్డులు 15 వేల నివాస గృహాల నుంచి మురుగు వెలువడుతోంది. పిల్ల కాలువల నుంచి మురుగు నీరంతా చక్రాల మడుగు లోకి వస్తోంది. ప్రధానంగా పట్టణంలోని ఎర్రబల్లి, ఉస్మాన్ నగర్, నూనెవారిపల్లి, రాంనగర్, రైల్వేస్టే షన్ రోడ్డు, రాజీవ్‌నగర్, పాతబస్టాండు, బోయ పాలెం, ఈడిగపాలెం, విద్యుత్తు నగర్, నలందనగర్, సాయినగర్ ప్రాంతాల నుంచి లక్షలాది లీటర్ల మురుగు నీరు చక్రాల మడుగుకు చేరుతోంది.

కలగానే నదుల ప్రక్షాళన

పట్టణాల నడి బొడ్డున విస్తరించిన నదులను ప్రక్షాళన చేస్తామని ఎన్నికల సమయంలో నేతలు హామీలు గుప్పిస్తున్నా అమలు చేయట్లేదు. పట్ట ణాల పరిధిలోనే నదులు ఉండడంతో పరివాహక ప్రాంతాలు పూర్తిగా ఆక్రమణకు గురయ్యాయి. ఆక్ర మితదారులు నివాసాలు ఏర్పాటు చేసుకోవడంతో నదుల విస్తీర్ణం కుంచించుకుపోతోంది. ఉన్నఫలంగా వరదలు వచ్చినా పచ్చిమొక్కలతో నిండిపోయిన నదుల్లో నీరు స్వేచ్ఛగా దిగువకు పారేందుక అవ కాశం లేదు. ఒడ్డున నిర్మించిన ఇళ్లు నీటమునిగే ప్రమాదం పొంచి ఉంది.


పాత రాయచోటిలో దుర్వాసన వెదజల్లుతున్న మాండవ్య నది

ఎస్టీపీలు ఏర్పాటు చేస్తున్నాం

పురపాలక నుంచి వెలువడే మురుగు నీరంతా నదుల్లోకి పారకుండా అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. మాండవ్య నదికి ఇరువైపులా పెద్ద కాలువలు నిర్మించాం. చాలా చోట్ల శిధిలావస్థ లకు చేరాయి. నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి పరిశీలించి మరమ్మతులకు చర్యలు తీసు కొన్నాం. మరో ఆరు ఎస్టీపీల ఏర్పాటుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. త్వరలోనే మురుగుకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

- వాసుబాబు, పురపాలక కమిషనర్, రాయచోటి

ఇజ్రాయెల్ యుద్ధం ఆపాలి

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: పాలస్తీనాపై ఇజ్రాయెల్ జరుపుతున్న ఆటవిక దాడులు, యుద్ధాన్ని ఆపాలని కోరుతూ సోమవారం రాయచోటిలో వామపక్ష పార్టీల నాయకులు ర్యాలీ నిర్వహించారు. అమెరికా సామ్రాజ్య వాద యుద్ధోన్మాదం నశించాలి.. పాలస్తీనాపై ఇజ్రాయెల్ నరమేధం ఆపా లని నినాదాలు చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి పి. శ్రీనివాసులు, సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు, సీపీఐఎంఎల్ జిల్లా కార్యదర్శి ఎం. విశ్వ నాథ, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎ. రామాంజులు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్ష నాయకులు

భూవివరాలు నిశితంగా పరిశీలించాలి

పెనగలూరు : ఫ్రీహోల్డ్ ఆఫ్ రైట్స్ భూముల వివరాలను దస్త్రాలలో, క్షేత్ర స్థాయిలో క్షుణ్నంగా పరిశీలించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లీలారాణి తెలిపారు. పెనగలూరు తహసీల్దారు కార్యాలయంలో సోమవారం అధికారులతో ఆమె సమా వేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతి అంశాన్ని పరిశీలించాలని సూచనలు ఇచ్చారు. తహసీల్దారు సీహెచ్ ఇంద్రాణి, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

పుల్లంపేట ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ


జయశ్రీ

పుల్లంపేట, న్యూస్‌టుడే: పుల్లంపేట ఎంపీడీవో పోతుగుంట జయశ్రీ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె వల్లూరులో పనిచేస్తూ బదిలీపై వచ్చారు. పుల్లంపేటలో ఎంపీడీవోగా పనిచేస్తున్న రఘురాం బదిలీపై వల్లూరు వెళ్లారు. ఆమె మాట్లాడుతూ మండ లాన్ని అందరి సహకారంతో అభివృద్ధి బాటలో నడిపిస్తామన్నారు. ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా విన్నవించుకోవచ్చునన్నారు.

స్పందించారు... శుభ్రం చేయించారు

రాజంపేట, న్యూస్‌టుడే: రాజంపేట పట్టణం ఆర్టీసీ బస్టాండు, పాతబస్టాండు వద్ద మూడేళ్ల కిందట పురపాలక ఆధ్వర్యంలో ప్రజల దాహార్తిని తీర్చడానికి రెండు నీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాలక్రమంలో వాటి బాగోగులను అధికారులు మరిచిపో యారు. ఫలితంగా ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న కేంద్రం అటకె క్కింది. ఇక పాతబస్టాండు కూడలిలో రెండు కుళాయిల్లో ఒకటే అడ పాదడపా పనిచేస్తోంది. ఈ సమస్యలను 'న్యూస్‌టుడే' పురపాలక ఏఈ నరేంద్రకుమార్ దృష్టికి తీసుకెళ్లగా... వెంటనే ఆయన స్పందించి సోమవారం పనులకు శ్రీకారం చుట్టారు. వాటిని శుభ్రం చేయించి, కుళాయిలను బిగించారు.

ఘనంగా శ్రీనివాసరెడ్డి వివాహ వార్షికోత్సవం

రాయచోటి, న్యూస్‌టుడే: రాయచోటి పట్టణం మదనపల్లె రోడ్డులో నివాసం ఉంటున్న పారిశ్రామిక వేత్త, తెదేపా నాయ కుడు మడితాటి శ్రీనివాసులురెడ్డి అలియాస్ కోడి శ్రీను వివాహ వార్షికోత్సవ వేడుకలు సోమవారం రాత్రి ఘనంగా నిర్వహిం చారు. ఆయన స్వగృహంలో అభిమానులు ఏర్పాటు చేసిన కేకును కోసి సంబరాలు జరుపుకొన్నారు. అనంతరం శ్రీనివాసు లురెడ్డి దంపతులను సత్కరించారు. మధ్యాహ్నం పేదలకు అన్న దానం ఏర్పాటు చేశారు. తెదేపా నాయకుడు రంజిత్‌రాయల్, సునీల్, ఫాజిల్, ఇమ్రాన్, లోకేష్, మహేష్, గణేష్, మల్లీ, బాబ్జీ, ఖాదర్‌వలీ పాల్గొన్నారు.


కేకు కోసి శ్రీనివాసులురెడ్డికి సత్కరిస్తున్న అభిమానులు

ఆర్థిక సాయం అందజేత

రాయచోటి, న్యూస్‌టుడే: రాయచోటి పట్టణంలో కార్పెంటర్‌గా పని చేసుకుంటూ జీవిస్తున్న బాదుల్లా అనే వ్యక్తి దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతుండడంతో కార్పెంటర్ల సంఘం సభ్యులు ఆయనకు ఆర్థిక సాయం అందించారు. చికిత్స నిమిత్తం రూ.2 లక్షలు అవసరం కావడంతో విరాళాలు సేకరించి సోమవారం బాధితుడి కుటుంబ సభ్యులకు రూ.50 వేలు అందించారు. కార్పెం టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జిలానీ, ఉపాధ్యక్షుడు కె. మోహనాచారి, కార్యదర్శి వెంకటరమణలు పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యంపై కేసు నమోదు

పెనగలూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని సాతుపల్లి గ్రామానికి చెందిన బసిరెడ్డి కార్తీక్ (10) అనే బాలుడు కనిపిం చడం లేదని అతని నాన్నమ్మ సుబ్బలక్షుమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్సై రవిప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం ఏడు గంటల సమయంలో పానీపూరీ తిని వస్తానని చెప్పి బస్టాండ్‌కు వెళ్లి తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఆయన వివరించారు.

స్వయం సహాయక సంఘాల బలోపేతానికి కృషి

వీరబల్లి, న్యూస్‌టుడే: సంఘాల బలోపేతానికి కృషి చేయా లని ఏపీఎం ఖాదర్‌వలి అన్నారు. వీరబల్లిలోని వెలుగు కార్యాలయంలో గ్రామసమాఖ్యల సభ్యులతో సోమవారం సమావేశం నిర్వహించారు. రుణాలు సక్రమంగా చెల్లించే సంఘాలకు రుణాలు సకాలంలో అందజేస్తున్నట్లు చెప్పారు. బ్యాంకుల ద్వారా వ్యక్తిగత రుణాలు రూ.5 లక్షల వరకు ఇస్తు న్నట్లు తెలిపారు. వాటితో జీవనోపాధులకు వినియోగించు కుని ఆర్థికంగా స్థిరపడాలని సూచించారు. కొత్తగా బదిలీపై వచ్చిన సుధాకర్, రైతు సంఘాల ఉత్పత్తిదారుల సీసీ గంగా ధర్‌లను పరిచయం చేశారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

పుల్లంపేట, న్యూస్‌టుడే: వేగంగా వెళ్తున్న లారీ మరో రెండు లారీలను ఢీకొన్న సంఘటన జాగువారిపల్లె రోడ్డు వద్ద జరిగింది. తిరుపతి వైపు వెళ్తున్న లారీ ఎదురుగా వస్తున్న రెండు లారీలను ప్రమాదవశాత్తు ఢీకొట్టింది. అదే సమయంలో తిరుమల నుంచి ఒంటిమిట్టకు వెళ్తున్న కారును ఢీకొట్టబోతుండగా డ్రైవర్ వెంటనే అప్రమత్తమై కుడి వైపునకు వాహనాన్ని తిప్పడంతో ప్రమాదం తప్పింది. అదృష్టవశాత్తు ఎవరికీ గాయాలు కాలేదని స్థానికులు తెలిపారు.

జగన్మాత.. జగజ్జనని


రాజంపేట : విశాలాక్షిదేవి అలంకారంలో వీరచౌడేశ్వరీదేవి


మోహినీదేవి తోటోత్సవంలో వాసవీమాత



రాయచోటి : గాంధీబజార్‌లో భవానీదేవి అలంకారంలో కన్యకాపరమేశ్వరి


వెంకటరాజంపేటలోని శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో అన్నపూర్ణాదేవిగా

శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అయిదో రోజు సోమవారం అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. రాజంపేటలో మోహినీదేవి అలంకారంలో కన్యకాపరమేశ్వరి దర్శనమిచ్చారు. పలు చోట్ల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి అర్చనలు, అభిషేకాలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. అమ్మవారి ఆలయాల సన్నిధిలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

- న్యూస్‌టుడే, రాయచోటి క్లస్టర్ బృందం


పుల్లంపేటలో కోలాటమాడుతున్న చిన్నారులు


రైల్వేకోడూరులో గజలక్ష్మి అలంకారంలో దర్శనమిస్తున్న కన్యకాపరమేశ్వరి


భక్తులకు అన్నదానం చేస్తున్న ఆర్యవైశ్యులు


చిన్నమండెం అమ్మవారిశాలలో భక్తుల పూజలు

దళితుల భూములకు పోరాటాలు తప్పవు

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: దళి తులకు ప్రభుత్వం కేటాయించిన భూములను కొందరు దర్జాగా కబ్జా చేస్తున్నారని.. ఆ పరిస్థితులను ఎదు ర్కోవడానికి పోరాటాలు తప్పవని జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్, కేవీపీఎస్ కన్వీనర్ ఓబిలి పెంచలయ్య పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమ వారం వారు మాట్లాడుతూ.. చిట్వేలి మండల పరిధిలోని తిమ్మయ్యగారిప ల్లెలో దళితులకు కేటాయించిన భూములను అగ్రవర్ణాల వారు ఆక్ర మిస్తున్నారని చెప్పారు. కోడూరు పరిధిలోని వీవీ కండ్రికలో రామ స్వామి చెరువుకు చెందిన 50 ఎకరా లను బడాబాబులు ఆక్రమిస్తే ఆ వ్యవహారంపై న్యాయస్థానం కలుగజే సుకుని ఆక్రమణలను తొలగించాలని చెప్పినా రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులు స్పందించడంలేద న్నారు. ఓబులవారిపల్లె మండలం లోని కొర్లకుంట చెరువు ఆక్రమణ లను కూడా అధికారులు పట్టించుకో వడంలేదని ఆరోపించారు.

రూ.10 లక్షల పరిహారం చెల్లించాలి

రాయచోటి, న్యూస్‌టుడే: సంబే పల్లె మండలం ఎస్.సోమవరంలో పిడుగుపాటుకు గురై మృతి చెందిన వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని వైకాపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్. రమేష్ కుమార్‌రెడ్డిలు సోమవారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లిం చాలని వారు డిమాండు చేశారు.

చిన్నమండెం ఈవోపీఆర్డీగా శేఖర్‌నాయక్

చిన్నమండెం: చిన్నమండెం మండల ఈవోపీఆర్డీగా బి.శేఖర్‌నాయక్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. కొంత కాలంగా ఈవోపీఆర్డీ పోస్టు ఖాళీగా ఉండడంతో రామాపురం ఈవో పీఆర్డీ ఇన్‌ఛార్జిగా వ్యవహరించారు. బదిలీల్లో భాగంగా గాలివీడు నుంచి శేఖర్‌నాయక్ చిన్నమండెం వచ్చారు. ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయ తీలను సర్పంచుల సహకారంతో అభి వృద్ధి చేస్తానన్నారు.

హెచ్చరిక బోర్డుల ఏర్పాటుకు డిమాండు


గాలివీడు తహసీల్దారు భాగ్యలతకు అర్జీ సమర్పిస్తున్న తెదేపా నాయకులు

గాలివీడు, న్యూస్‌టుడే: గోరాన్‌చెరువు పంచాయతీ పరిధిలోని తహసీల్దారు కార్యాలయం చుట్టూ కిలో మీటరు దూరంలోని ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయా లని తెదేపా నాయకులు తహసీల్దారు భాగ్యలతకు సోమవారం అర్జీ సమర్పించారు. మండల బాధ్యుడు పురం హేమకుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. రెవెన్యూ, మండల పరిషత్తు కార్యాలయాల సముదాయాల పరిసర ప్రాంతాల్లో ప్రైవేటు స్థలాల ఇంటి జాగా మూరల పద్ధతిలో రూ.లక్షలు ధర పలుకుతోందన్నారు. జన సంచారంలో విలువైన ప్రభుత్వ భూము లను ఇతరులు కబ్జా చేయకుండా రక్షించాలన్నారు. తెదేపా నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, పప్పిరెడ్డి మల్‌రెడ్డి, సుబ్బారెడ్డి, వేణుగోపాల్, చిన్నయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి


కార్యకర్తలు, నాయకులతో డీసీసీ అధ్యక్షుడు గాజుల భాస్కర్

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: క్షేత్ర స్థాయిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని ఆ పార్టీ జిల్లా అధ్య క్షుడు గాజుల భాస్కర్ పేర్కొన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గ బాధ్యురాలు గోశాల దేవి, సీనియర్ నాయకుడు శాంతయ్య, మండల మాజీ అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ అహ్మద్‌తో కలిసి కార్యకర్తలో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ త్వరలోని నియోజకవర్గంలోని అయిదు మండలాలకు పార్టీ అధ్యక్షుల నియామకం, క్రియాశీలక కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం


మాట్లాడుతున్న జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ రియాజ్‌బేగ్

రాయచోటి, న్యూస్‌టుడే: లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని నేషనల్ హెల్త్ మిషన్ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టరు రియాజ్‌బేగ్ పేర్కొన్నారు. కె.రామాపురంలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో సోమ వారం ఆయన మాట్లాడారు. ప్రతి స్కాన్ సెంటర్ నిబంధనల మేరకు జిల్లా అథారిటీ వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. స్కానింగ్ సెంటర్ల వివరాలు సక్రమంగా అందజేయని వారిపై కఠిన చర్యలు తీసు కుంటామని జిల్లా ఆరోగ్య వైద్య శాఖ అధికారి డాక్టరు కొండయ్య పేర్కొన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్ దేవశిరోమణి, స్కానింగ్ సెంటర్ల నిర్వాహ కులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మట్లి గ్రామాభివృద్ధే లక్ష్యం


కేకు తినిపించుకుంటున్న తెదేపా నాయకులు

వీరబల్లి, న్యూస్‌టుడే: మట్లి గ్రామాభివృద్ధే లక్ష్య మని సర్పంచి సోమారపు నాగార్జు నాచారి అన్నారు. మట్లి ఎల్లంపల్లిలో సోమవారం ఆయన జన్మదిన వేడుకలను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేకు కోసి బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకొన్నారు. అభి వృద్ధే లక్ష్యంగా గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్నారని ప్రశంసించారు. తెదేపా నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

పెనగలూరు, న్యూస్‌టుడే: ప్రజల సమస్యలు పరిష్కరించడమే ధ్యేయ మని ఎంపీడీవో విజయారావు తెలిపారు. సోమవారం పలు రకాల సమ స్యలపై ప్రజలు, టీడీపీ నాయకులు ఆయన్ను కలిశారు. నూతనంగా ఓబు లవారిపల్లి నుంచి బదిలీపై పెనగలూరు వచ్చిన ఎంపీడీవో విజయారావును తెలుగుదేశం పార్టీ మండల బాధ్య కమిటీ అధ్యక్షుడు నాగేశ్వర నాయుడు, జిల్లా అధికార ప్రతినిధి కొత్త బాలకృష్ణ, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి నాగి నేని రాంప్రసాద్ నాయుడు, టీడీపీ నాయకులు పతకమూరి బాబు నాయుడు, కేత ఉగ్రనరసింహా కలిసి ఆయన్ను ఘనంగా సన్మానించారు.

అర్జీదారులు స్వేచ్ఛగా ఫిర్యాదు ఇవ్వొచ్చు

రాయచోటి, న్యూస్‌టుడే: సమస్యల పరిష్కారానికి వచ్చే అర్జీదారులు స్వేచ్ఛగా పోలీసు స్టేషన్లకు వచ్చి వినతులు అందించవచ్చని ఎస్పీ వి. విద్యా సాగర్‌నాయుడు పేర్కొన్నారు. ఎస్పీ కార్యాలయంలో నుంచి వినతులు స్వీక రించారు. చట్ట పరిధిలో గడువు లోపు సమస్యలు పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 58 మంది అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు.


అర్జీదారు సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు